TS-11-0036701

భయంతో
ఉన్నవాళ్లు ఏదీ
సాధించలేరు
- రవీంద్రనాథ్ ఠాగూర్

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 13 మంగళవారం, జనవరి 13, 2026 , పేజీలు - 12 వెల : 2/-

# దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం





**ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలనే నిర్ణయం**


**తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 15 శాతం కోత**

**'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్ల ప్రారంభంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్,జనవరి 12 :** దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అంది స్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 కోట్లతో పరికరాలను అందించామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తాం. ఈ బ్జడెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నాం. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలి. కన్నవారి పట్ల బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని రేవంత్ అన్నారు మిగతా2లో...

## పిజెఆర్‌కు సిఎం రేవంత్ ఘన నివాళి

**హైదరాబాద్,జనవరి 12:** దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పి. జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతా బాద్ సర్కిల్ లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటిం చారు. పిజెఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయన ప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిజెపి తనయ విజయా రెడ్డి,మంత్రి దామోర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పిజెఆర్‌కు నివాళి అర్పించారు.



## విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్



**వీటి నిర్వహణ బాధ్యత పూర్తిగా కలెక్టర్లదే**

**వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్,జనవరి 12:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉపముఖ్యమంత్రి మరోసారి తన నిబద్ధతను వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం మిగతా2లో...

## పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ

- విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి
- తెలంగాణకు సుప్రీం ధార్మసనం సూచన
- కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్



**న్యూఢిల్లీ,జనవరి 12 :** పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్క రించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్రం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు మిగతా2లో...

## ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

**డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్,జనవరి 12:** సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ మిగతా2లో...

## సిఎం రేవంత్‌తో జార్ఖండ్ మంత్రి భేటీ




**హైదరాబాద్,జనవరి 12:** సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జార్ఖండ్ ఆరోగ్యశాఖ మంత్రి డా. ఇర్ఫాన్ అన్సారీ కలిసారు. సిఎం ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. తెలంగాణలో అమలువుతున్న అభివృద్ధి పనులపై వివరించారు.

## అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

- ఎరువుల ఇవ్వలేని వాడు...ఏం ఉద్ధరిస్తాడు
- గెలిచిన సర్పంచ్‌లతో కెటిఆర్ ఆత్మీయ సమ్మేళనం
- ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు



**మహబూబ్‌నగర్,జనవరి 12:** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువలే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకు పడ్డారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి మిగతా2లో...



## సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

- పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లియర్
- అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు ద్రోహం
- మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ

**హైదరాబాద్,జనవరి 12:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది.

మిగతా2లో...

## పక్కాగా పనిదినాలు.. కూలీ అమలు

- గుంతలు తవ్వే కార్యక్రమానికి చెల్లుచీటీ
- వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు
- జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు
- పాక్, బంగ్లాలో హిందూమహిళలను ప్రధానిని చేయమంటారా
- ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్



మంగళవారం,
జనవరి 13, 2026
నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక



# దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం

(మొదటి పేజీ తరువాయి)

దివ్యాంగులు ఒకరినొకరు పెళ్లి చేసుకుంటే రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. వారిని ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తాం. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించు కుంటూ ఎదగాలి. ఈ ప్రాంతంలో ప్రత్యేక ప్రతిభావంతులకు జైపాల్ రెడ్డి స్ఫూర్తి. మా ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులను కోరుతున్నా. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలి. ట్రాన్స్‌జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుంది దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన జరిగింది. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి. మా ఒత్తిడితోనే కేంద్రం కుల గణన చేస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు భట్టి. స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనన్నారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ ఆదేశాల ద్వారా ప్రాజెక్ట్ అమలులో వేగం, జవాబుదారీతనం, పారదర్శకత ఉండేలా చూస్తున్నామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కాగా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తెలంగాణ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమానత్వం, సమగ్ర విద్యా అవకాశాలు అందరికీ అందుబాటులోకి రావాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా ఈ స్కూల్స్ రూపకల్పన చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆధునిక సౌకర్యాలు, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా–కరిక్యులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ స్కూల్స్ దోహదపడతాయని రేవంత్ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 105కి పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబడుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున స్కూల్స్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కేటాయించారు.

బ్జడెట్‌లో రూ.11,600 కోట్లు, మరిన్ని దశల్లో రూ.21,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా కుల, మత, ఆర్థిక వివక్షలు తొలగి, అందరూ ఒకే వేదికపై చదువుకునే అవకాశం లభిస్తుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను సమానత్వ సాధనంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇవి కేవలం భవనాల నిర్మాణం కాదు.. సమాజంలో సామరస్యం, సమాన అవకాశాలు, భవిష్యత్ తరాల బలోపేతం కోసం చేపట్టిన విప్లవాత్మక అడుగని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ

(మొదటి పేజీ తరువాయి)

వినిపించుకోవచ్చనీ అభిప్రాయపడింది. అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అబిషేక్ మను సింఘ్వి మరోసారి వాదనలు వినిపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదిం చిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకె ళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# పక్కాగా పనిదినాలు..కూలీ అమలు

**హైదరాబాద్,జనవరి 12** వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయో గించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసా య సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసం ధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్క రణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ–జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపో యిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందు వులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం లో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండద న్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

# సమ్మక్క-ది గ్లోరీ ఆఫ్ మేడారం

- పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జనవరి 12 :** సమ్మక్క–ది గ్లోరీ ఆఫ్ మేడారం పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ వెలువరించిన సమ్మక్క ది గ్లోరీ ఆఫ్ మేడారం అనే పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ఆవిష్కరించారు. మేడారంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, మేడారం వడ్డే పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ములుగు డిపిఆర్ఓ రఫీ తదితరులు ఈ ఆవిష్కరణ సభలో పాల్గొన్నారు. మేడారం జాతర ను కళ్ళ ముందుంచేలా విస్తృత సమాచారంతో కూడిన ఈ సమ్మక్క గ్లోరీ ఆఫ్ మేడారం పుస్తకం వెలువరించడం పట్ల రచయితను మంత్రి సీతక్క అభినందించారు. మేడారం జాతరలో గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు, మొక్కులు, జాతర జరిగే తీరు, వివిధ రాష్ట్రాలనుండి వచ్చే గిరిజన జాతుల సంస్కృతీ సాంప్రదాయాలు, మీడియా కవరేజి, జాతరలో ఎదురయ్యే ఇబ్బందులు... ఇలా భిన్న అంశాలపై ఈ సమ్మక్క పుస్తకం ముద్రించడం జరిగింది.



# పేదల భూములకు రక్షణ కల్పిస్తాం

- భూములు అమ్మి డబ్బులు జమచేసుకునే ఆలోచన లేదు
- కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన




**హైదరాబాద్,జనవరి 12 :** తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీల్లో.. 40ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

(మొదటి పేజీ తరువాయి)

ఖాతాలో జమ చేయనుంది. సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

# సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

(మొదటి పేజీ తరువాయి)

హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు. నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు. సివిల్ సూట్ ÷ల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు. బలహీనమైన రిట్టు వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురు దక్షిణ చెల్లించుకున్నాడని విమర్శించారు. గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పుకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు.

# అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి రెండేళ్లయినా రాష్టాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసింద్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్టుండె, ఇప్పుడు ఎట్టున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్లు ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసింద్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు. 'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండే, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, ÷÷–లవోర్లుగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.

# వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

- అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





చర్చ :- బ్యూరోకరీంనగర్ : కరీంనగర్ మార్కెట్ రోడ్డు లోని శ్రీ లక్ష్మీ,పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈనెల 23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ సంవత్సరం మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులంతా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. గతేడాది మాదిరిగానే స్వామివారి సేవకు ముందుకు వచ్చి విరాళాలు సమర్పిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలోట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వేడుకలు నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ అధికారులతో వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ స్వామివారి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ పరిసరాల్లో శానిటేషన్, క్లీనింగ్ సమస్యలు రాకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలు బ్రహ్మోత్సవాల నిర్వాహణకు విరాళాలను ప్రకటించారు.

సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, కరీంనగర్ కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఏసీపి వెంకటస్వామి, ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

# వివేకానందు డే యువతకు ఆదర్శం: ఎస్సై పుష్పాల రామారావు



చర్చ:వైరా :యువ శక్తిని తట్టి లేపి సమాజాభివృద్ధికి పటిష్ట బాటలు వేసే లా స్ఫూర్తి నింపిన స్వామి వివేకానందు డే యువతకు మార్గదర్శకుడు అని వారి స్ఫూర్తి తో బలహీనతల కు దూరం గా ఉండాలని వైరా ౨౫× పుష్పాల రామారావు కోరారు. వైరా మండలం గొల్ల పూడి గ్రామం లో వివేకానంద వికాస వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి,జాతీయ యువజన దినోత్సవం లో గ్రామ సర్పంచ్ మేడూరి రామారావు అధ్యక్షతన జరిగిన "యువజనోత్సవం" లో ఆయన మాట్లాడుతూ యుత దుర్ వ్య సనాలకు దూరంగా మెలగాలని,మత్తు పదార్థాల పై,సమాజ వ్యతిరేక శక్తులు పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలియజేసారు. ఈ సందర్భం గా సఆర్పంచ్ మేడూరి రామారావు మాట్లాడుతూ వైరా మం లో మరెక్కడా లేని విధంగా గొల్ల పూడి గ్రామం లో గత 20 సంవత్సరాలుగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్న వివేకానంద వికాస వేదిక బాధ్యులు జీవి సూర్యప్రకాష్ రావు,అనంతు,గూడపాటి శ్రీనివాసరావు,కోర్లగుంట మురళీ,తబలా కృష్ణ,రవి,గ్రామం లో చదివి ఉద్యోగ,వ్యాపారాల లో స్థిర పడిన అందరినీ అభినందించారు. ఈ సందర్భం గా గ్రామం లో రాళ్ళబండి కరుణామయి గారు 20, గూఢపాటి శ్రీనివాసరావు గారు 10 అందజేసిన దుప్పట్లను 30 మంది బీదలకు ౦ఐ, సర్పశీచ్, గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమం లో సీపీఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు,బీజేపీ మండల అధ్యక్షులు దోసపాటి కళ్యాణ్, గ్రామ ఉప సర్పంచ్ ఈలాప్రోలు వెంకటప్పయ్య, షేక్ సైదా,మిట్టపల్లి సతీశ్,తే రాజేష్,ముత్తారపు దేవిడ్,శాఖమూడి లోకేశ్వర రావు,పొన్నం నరసిహారావు, కొమర నేని శ్రీనివాసరావు,గంగవరపు మోహనరావు,అమరనేని రాఘవయ్య,మిట్టపల్లి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఖమ్మం లో స్థిరపడిన గొల్లపూడి వాసి, వ్యాపార దిగ్గజం ఈవూరి వెంకటేశ్వరరావు ను గ్రామస్తులు ప్రత్యేకం గా సత్కరించారు,గ్రామ పెద్దలకు చిత్రకారులు ,ఉపా ధ్యాయులు సూర్యం గారు గీసిన వారి చిత్రాలను ౨౫× బహుకరించారు.

# యువతకు వివేకానందుని బోధనలు ఆదర్శంగా కావాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





చర్చ, జగిత్యాల: స్వామి వివేకానందుని బోధనలు నేటి యువత కు ఆదర్శం కావాలని, ఆయన సూచించిన మార్గంలో నడిచి మంచి భవిత కు బాటలు వేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలోని స్వామి వివేకానంద విగ్రహానికి జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చీఫ్ మినిస్టర్ కప్ అవగాహనలో భాగంగా టార్చ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జగిత్యాల పట్టణం నుండి జగిత్యాల జిల్లా వివిధ మండలాలలో కొనసాగుతుందనీ తెలిపారు.

ఈ సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ మాట్లాడుతూయువతకు స్ఫూర్తి ప్రదాత, దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అన్నారు. యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల ద్వారా తన భవిష్యత్తును మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తి పెంచుటకు గత రెండు సంవత్సరాలుగా చీఫ్ మినిస్టర్ కప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ యువత లక్ష్యసాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, సమాజ సేవను తమ జీవిత లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివేకానందుని ఆలోచనలు నేటి యువతకు దిశానిర్దేశకమని, విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. చీఫ్ మినిస్టర్ కప్ 2025 ఈనెల 17 నుండి ఫిబ్రవరి 23 వరకు గ్రామ పంచాయతీల నుండి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి రవి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడలకు సంబంధించిన కోచులు , క్రీడాకారులు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మంత్రులను కలిసిన వెలిచాల

- మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిసిన వెలిచాల రాజేందర్ రావు
- 13న కరీంనగర్ కు రానున్న వెలిచాల..
- ఘన స్వాగతానికి భారీ ఏర్పాట్లు..





చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను నూతనంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు రాజేందర్ రావును శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. రాజేందర్ రావు ఇరువురు మంత్రులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రులు కాంగ్రెస్ పార్టీని రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్ట్యా మరింత కష్టపడి పనిచేయాలనీ, మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని కరీంనగర్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని రాజేందర్ రావుకు సూచించారు. కరీంనగర్లో వార్డు వార్డునా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో సమస్యల పరిష్కారానికి రాజేంద్రరావు ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిధుల మంజూరుకు సంబంధించి కృషి చేస్తామన్నారు. అందరం కలిసి కరీంనగర్ కార్పొరేషన్ పై జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేద్దామని మంత్రులు పేర్కొన్నారు. కరీంనగర్లో సమస్యలు పరిష్కరిస్తూనే మరోవైపు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలనీ ఇందుకు అధికారులతో నిత్యం టచ్ లో ఉండాలనీ మంత్రులు వెలిచాల రాజేంద్రరావుకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాజేంద్రరావు తెలిపారు. నాయకులందరితో కలిసి సమిష్టిగా కాంగ్రెస్ పార్టీ విజయానికి కష్టపడి పని చేస్తానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అధిష్టానం పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక కాంగ్రెస్ నేతల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అంటే కరీంనగర్ గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దుతామని రాజేంద్రరావు పేర్కొన్నారు.

■ ఘన స్వాగతం.. భారీ ర్యాలీకి ఏర్పాట్లు..

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు మొదటిసారిగా మంగళవారం కరీంనగర్ కు రానున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, వెలిచాల అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అల్గునూరు చౌరస్తాలో రాజేంద్రరావుకు ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం పెద్ద ఎత్తున మోటార్ సైకిల్లు, కార్లు, ఇతర వాహనాలతో ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు అలుగునూర్ చౌరస్తా నుంచి గీతాభవన్ చౌరస్తా మీదుగా డిసిసి కార్యాలయం వరకు ర్యాలీ ఏర్పాట్లు చేపట్టారు. గీతాభవన్ చౌరస్తాలో స్వాగత కార్యక్రమం ఉంటుందని, కరీంనగర్ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు డిసిసి కార్యాలయంలో రాజేంద్రరావు ప్రెస్ మీట్ నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సన్నిహితులు, వెలిచాల అభిమానులు సర్పంచులు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు.

## తీగల బంజర తండా అభివృద్ధిలో మరో మైలురాయిద : సోలార్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన



చర్చ:వైరా :జిల్లాలోని తీగల బంజర తండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా, జిల్లా నాయకులు శ్రీ పోట్ల శ్రీను ఆధ్వర్యంలో తండాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సోలార్ లైట్ల పనులకు గౌరవనీయులైన సర్పంచ్ నూనావత్ శ్రీను గారు శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. తండా వాసుల సౌకర్యార్థం, రాత్రి వేళల్లో వెలుగులు నింపేందుకు ఈ సోలార్ లైట్ల ప్రాజెక్టును చేపట్టినట్లు
ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దేవల, నూనావత్ వంశీ, మంగ్య, వంశీ, శివ, బద్య, గణేష్ మరియు ఇతర ముఖ్య నేతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి జండా పండుగ



చర్చ:వైరా : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జండా పండుగ కార్యక్రమం చేపట్టారు, ఏనుకూరు మండల వ్యాప్తంగా జెండా పండుగ ఇంటింటికి జెండా కట్టే కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఓబిసి సెల్ నాయకులు గజ్జి సూర్యనారాయణ యాదవ్ రామకృష్ణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ బాధ్యులు గ్రామపంచాయతీ సర్పంచులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వైరా ఏడవ వార్డ్ లో మేరీమాత వార్షికోత్సవం



చర్చ:వైరా :వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డు నందు పణితి శ్రీను అద్వార్యంలో నిర్వహించిన మేరీమాత వార్షికోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేరీమాత ఆశీస్సులతో వైరా మున్సిపాలిటీ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెడ్ స్టేట్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల సంతోష్, నరపునేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్ రెడ్డి, ధర్నా. రాజశేకర్, పణితి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 18వ తారీఖున ఖమ్మం లో జరుగు సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను జయప్రదం చేయండి

- యాద్ర బాబు వైరా నియోజకవర్గ ఇన్చార్జ్




చర్చ: వైరా :ఈనెల 18వ తారీఖున ఖమ్మం లో ఎస్సార్ అండ్ బీజేఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్ నందు సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా నుండి అధిక సంఖ్యలో ఖమ్మంనికి తరలిరావాలని పోయిరా నియోజకవర్గ ఇన్చార్జి యాద్రబాబు పిలుపునిచ్చారు ఈరోజు వైరా మండల కార్యాలయంలో వైరా మండల కౌన్సిల్ సమావేశం అధ్యక్షతన జరిగిన సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పుట్టి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైరా నుండి రాజకీయ మేధావులు కమ్యూనిస్టు పార్టీ సభ్యులు అభ్యుదయవాదులు పేరుపేరునా తరలిరావాలని కదిలించాలని ఖమ్మంలో జరిగే భారీ ర్యాలీలో బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యా మాల గోపాలరావు మరియు పట్టణ కార్యదర్శి వట్టపల్లి రాఘవరావు ఏఐటియుసి మండల కార్యదర్శి గారపాటి అశోక్ రాయపూడి శ్రీను రాకేశ్ రెడ్డి కంచర్ల కృష్ణ మోటార్ కొండ రాంబాబు ముత్తయ్య లక్ష్మయ్య బండారుపల్లి రవి తేరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్జీఎఫ్ అండర్-19 బాలుర సాఫ్ట్‌బాల్ విజేత మెదక్ జిల్లా జట్టు



చర్చ బెల్లంపల్లి :బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల విద్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో రాష్ట్ర ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి -- ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ద్వితీయ బహుమతి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ బహుమతి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుఫైనల్స్‌లో మూడు జిల్లాల జట్లు హోరాహోరీగా తలపడగా, మెదక్ జిల్లా జట్టు సమన్వయం, క్రమశిక్షణ, ఆటలో వేగంతో ప్రత్యర్థులను మట్టికరిపించింది. ఈ విజయంతో మెదక్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో తమ సత్తాను మరోసారి నిరూపించారు

## క్రాంతి కళాశాలలో ఘనంగా స్వామి వివేకానంద జన్మదిన వేడుకలు




చర్చ:వైరా :స్థానిక ఎస్ ఆర్ ఠాగూర్ విద్యా సంస్థలైన శ్రీ క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జన్మదిన సందర్భంగా విద్యా సంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత , చైర్మన్ వాసిరెడ్డి సునీత నరేంద్ర దత్త చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. " రన్ ఫర్ స్వదేశీ".... కార్యక్రమంలో భాగంగా విద్యా సంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ వివేకానందుని రచనలు రాజయోగ, కర్మయోగ, జ్ఞాన యోగ, మొదలైన రచనల ద్వారా యువతను ఉత్తేజపరిచిన ఘనత స్వామి వివేకానందునిది అని అందుకే ఆయన జన్మదినాన్ని " యువజన దినోత్సవం గా జరుపుకుంటున్నామని, ఆయన జీవిత విశేషాలను స్ఫూర్తిగా తీసుకుని వ్యక్తిగత విజయవంతంతో పాటుగా పరోక్షంగా దేశ సేవలో నిమగ్నమవాలని ఆ రకంగా యువత పటిష్టమైనటువంటి భవిష్యత్తును నిర్ణయించుకోవడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. యువజన దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వివిధ విభాగాలలో క్రీడలు నిర్వహించారు. మంచి ప్రావీణ్యత, ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించి బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లింగారావు, ప్రిన్సిపల్ కృష్ణారావు, మజీద్ వేణు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన





చర్చ:- హుస్నాబాద్:తెలంగాణలో జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తుందని జనసేన పార్టీ అధిష్టానం ప్రకటించడంతో, నియోజకవర్గ ఇంచార్జ్ తగరపు శ్రీనివాస్ ఆదేశాల మేరకు, హుస్నాబాద్ పట్టణ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తుందని పట్టణ అధ్యక్షుడు సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి భావజాలాన్ని, ఆయన ఆశయాలను, సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు ఈ మేరకు జనసేన అభ్యర్థులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల సంజీవ్, ఉపాధ్యక్షుడు నేవూరి పవన్, ప్రధాన కార్యదర్శి కొమ్ముల మధుబాబు, సాగర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆధ్వర్యంలో సింగరాయ జాతర ఏర్పాట్లు




చర్చ:- కోహెడ :సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు సోమవారంరోజు సింగరయజాతర ఏర్పాట్లలో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో చేస్తున్నట్లు అట్టి ఏర్పాట్లు అన్ని శాఖల అధికారులు తమ తమ విధులు నిర్వహించాలని ఎలాటి ఇబ్బందులు ప్రజలకు కలగకుండ చూడాలని ఎవ్వరికి ఎలాటి ఇబ్బందులు కలగవద్దు అని కూరెళ్ల,తంగళ్ళపల్లి రెండు గ్రామాలకు 4 లక్షల రూపాయలు చొప్పున్న బస్వాపూర్ గ్రామానికి 2 లక్షలు ప్రభుత్వం బడ్జెట్ మంజూరి చేయడం జరిగింది కావున గ్రామ పంచాయతీలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నాముకావున ప్రజలకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేయాలని ఇట్టి ఆదేశాలు జిల్లా కలెక్టర్ గారి తరఫున ఆర్డీవో,హుస్నాబాద్ మరియు తహసిల్దార్ కోహెడ మండలఅన్ని శాఖల అధికారు లకు నూతన సర్పంచులు కు ఎంపీడీవోను, తగిన చర్యలు తీసుకోవాలని ,లేని ఎడల ఉన్నత అధికారులకు శాఖ పర చర్యలకు నివేదించబడునని స్పష్టం చేశారుఇట్టి జాతరకు 10 లక్షల రూపాయలు మంజూరి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ నూతన సర్పంచులు తెలిపారు.

## కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు:వైరా ఇంచార్జ్ ఏసిపి వసుంధర యాదవ్



చర్చ:వైరా :సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు పేకాట జూదం వంటి అసంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వైరా ఇన్చార్జ్ ఏసిపి వసుంధర యాదవ్ అన్నారు సోమవారం ఏసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలు ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని పేకాట జూదం కోడిపందాలు వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు ఆర్థికంగా నష్టపోవద్దని కోరారు ఈ కార్యకలాపాలు జరిగిన సమాచారాన్ని ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు

# యూత్ డిక్లరేషన్ హామీలేవి

- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- యూత్ డిక్లరేషన్ హామీలు అమలు అయ్యేది ఎన్నడు
- జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వేయాలి
- రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి
- నిరుద్యోగ యువతకు 4వేల భృతి అందించాలి
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్ పటేల్



చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- ఎన్నికలకు ము.దు రేవంత్ రెడ్డి ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని డివైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరేష్ పటేల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. జమ్మికుంట మండల కేంద్రంలో డివైఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న నరేష్ పటేల్ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ హామీల అమలుపై తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ఇంకెప్పుడు నెరవేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించమంటే నిరుద్యోగులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగులందరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, జాబ్ కాలండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ ని ప్రకటించారన్నారు. నామ మాత్రంగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏ ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదన్నారు. సమగ్రమైన వివరాలతో, పూర్తి సమాచారంతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను తక్షణమే వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే వరకు రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4000 ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ వికాసం ద్వారా ఇప్పటికే గుర్తించి, లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయి,
మండల కార్యదర్శి ముద్దమల్ల చరణ్, ఉపాధ్యక్షులు జీవన్, నాయకులు జస్వంత్, అబ్రార్, రిజ్వాన్ ఆలీ, విష్ణువర్ధన్, గణేష్ అనిల్ ,శ్రీకాంత్ తదిరులు పాల్గొన్నారు

# వేములవాడలో జాతీయ ఎస్సీ కమిషన్ సమీక్ష

- బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలి
- అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, అధికారులతో సమీక్ష
- భీమేశ్వర, బద్ది పోచమ్మ ఆలయాల్లో పూజలు





చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ ఆదేశించారు. వేములవాడ పట్టణానికి సోమవారం రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. భీమేశ్వర ఆలయ సమీపంలోని అతిథి గృహంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ వివిధ పథకాలు, అట్రాసిటీ కేసులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి చార్జీ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్టీ పథకాల ప్రయోజనాలు అందిపుచ్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో ఎంత మంది విద్యార్థులు, వారికి అందిస్తున్న మెనూ, అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి, కులాంతర వివాహాలకు ప్రోత్సాహకంపై ఆరా తీశారు.కులాంతర వివాహాలకు ఇటీవల ఇద్దరికి రూ. 2 లక్షల 50 వేల ఫిక్స్ బాండ్ లు అందజేశామని, అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యా నిధి కింద ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొకరికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ. 1కోటి 80 లక్షలు లబ్ధిదారులకు అందించామని అధికారులు కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకువెళ్లారు. అన్ని ఎస్సీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నామని, కాస్మొటిక్ చార్జెస్, యూనిఫాం, బుక్స్ అందిస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

### భీమేశ్వర ఆలయంలో పూజలు

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ భీమేశ్వర ఆలయానికి చేరుకోగా, అర్చకులు స్వాగతం పలికారు. రాజరాజేశ్వరస్వామికి రాంచందర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఏఎస్పీ రుత్విక్ సాయి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఇన్చార్జి ఎస్సీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘ భవనం ప్రారంభం





చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- కరీంనగర్ నగరంలో మట్టి కనపడకుండా రోడ్లు వేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్న.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఉందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గుంతలు పడ్డ రోడ్లను కూడా పూడ్చలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేలకు రావలసిన నిధులు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంక్షేమ సంఘ భవనాన్ని సోమవారం మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు.
టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సుమారు 1600 కోట్ల రూపాయలు వెచ్చించి నగరాన్ని అభివృద్ధి చేశామని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని కుల సంఘ భవనాలకు స్థలం కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేసి నిర్మించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఏదైనప్పటికీ, ప్రభుత్వంతో పోరాడి కరీంనగర్ కు నిధులు తెస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు.. మాజీ ఎంపీ బోయిన్పల్లి వినోద్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ,మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, టిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు రమేష్, సంఘ సభ్యులు చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి, గడ్డం ప్రశాంత్ రెడ్డి, కుల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర సంస్థకి ఇవ్వడాన్ని విరమించుచుకోవాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు.

ఆదినారాయణ డిమాండ్



చర్చ, సత్తుపల్లి:మధ్యాహ్న భోజన పథకాన్ని గత 20 సంవత్సరాలకు పైగా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతూ నిర్వహిస్తున్న కార్మికులను తొలగించి,ఇట్టి పథకాన్ని ప్రైవేటు సంస్థ అయిన అక్షయ పాత్ర సంస్థలుకు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని,దీన్ని విరమించుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు.ఆదినారాయణ డిమాండ్ చేశారు.వేంసూర్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఎమ్మార్వో కార్యాలయం ముందు సోమవారం రోజు ఆందోళన నిర్వహించి,డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా దండు.ఆదినారాయణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలకు పైగా వంటచేసి పిల్లలకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపాలని, అక్షయపాత్రకి ఇచ్చేదాన్ని ఆపి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని,అదేవిధంగా రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా 10,000 రూపాయలు వేతనం చేయాలని,పిఎఫ్,ఈఎస్ఐ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,గ్యాస్,కోడిగుడ్లు నిత్యవసర సరుకులు ప్రభుత్వం సరిపడా చేయాలని,ఇంకా మధ్యాహ్న భోజనం కార్మికులకు రావలసిన పెండింగ్ బిల్లులు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని,వారందరికీ పెండింగ్ బిల్లులు వేతనాలు వెంటనే చెల్లించాలని,డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకుంటామని వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని దృష్టిలో పెట్టుకొని వారికి రావలసిన బిల్లులు చెల్లించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్.రంజాన్ బి,వేంసూరు మండల యూనియన్ అధ్యక్షులు మెట్టపల్లి సత్యవతి,కర్రి రాజమ్మ, సామ్రాజ్యం,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామలక్ష్మి, కిన్నెర మారయ్య, సాదు.సూ రమ్మ, మల్లమ్మ ,పుల్లమ్మ,కోటయ్య,కుమారి,తులసమ్మ,నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ

- ఘనంగా ప్రారంభించిన పెద్దపల్లి ఎమ్మెల్యే

**విజయ రమణారావ**



చర్చ,పెద్దపల్లి:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సెకండ్ ఎడిషన్ సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ సోమవారం పెద్దపల్లిలో ఘనంగా జరిగింది. పెద్దపల్లి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అక్కపాక సురేష్ ఆధ్వర్యంలో ర్యాలీని పెద్దపల్లి శాసనసభ్యులు విజయ రమణారావు క్రీడా జ్యోతినీ వెలిగించి ప్రారంభించారు. క్రీడల ద్వారా యువతను సరైన దిశలో నడిపించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే సీఎం కప్ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్రీడాజ్యోతి ర్యాలీ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండిప్రధాన రహదారి మీదుగా బస్టాండ్ వరకు కొనసాగి ప్రజల్లో క్రీడల పట్ల అవగాహన కల్పించింది. విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడల ప్రాధాన్యతను చాటిచెప్పారు. "క్రీడలతో ఆరోగ్యం -- ఆరోగ్యంతో అభివృద్ధి" అనే నినాదంతో ర్యాలీ సాగింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూక్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, జెడ్పి సీఈవో కే నరేందర్, బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్ జే రంగారెడ్డి, ఆర్టిఏ రంగారావు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాజశేఖర్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, పేట అధ్యక్ష కార్యదర్శులు దాసరి రమేష్, సురేందర్, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ కనుకుంట్ల లక్ష్మణ్, సిటీ కేబుల్ సదానందం, ఏ ఎం ఓ పీఎం షేక్,కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు తోట శంకర్, బేస్ బాల్ అసోసియేషన్ వాసు,టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, ఇండియన్ ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్,వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, షఫీ, కుమార్, వెంకటేష్, నక్క శ్రీనివాస్, శివ, సీనియర్ క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సీఎం కప్ పోటీలు యువతకు ఉత్సాహాన్ని నింపుతూ క్రీడల వైపు ఆకర్షించేలా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## స్వామి వివేకానంద 163వ, జయంతి వేడుకలు



చర్చ:- హుస్నాబాద్: పట్టణంలో సోమవారం రోజున ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి స్వామి వివేకానంద ఆలోచనల సాధనకై కృషిచేస్తుంది
ఏబీవీపీ, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ,హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో 163వ స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో వివేకానందుని చిత్రప టానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ఓ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ కేవలం మహనీయుల జయంతి వర్ధంతులకు వారిని స్మరించుకోవడం కాదు, మన నిత్య జీవితంలో వారి ఆశయాల సాధనకై నడవటమే వారికి నిజమైన ఘననివాళి అని అన్నారు. భారతదేశం తోలుబొమ్మలు ఆడించే దేశం కాదు నా దేశం అనుకుంటే ప్రపంచాన్ని తోలుబొమ్మలా ఆడించగలదు అని కేవలం ఒక్క ప్రసంగంతో ప్రపంచానికి మన దేశ వినయాన్ని, సమాజం అంతా ఒక కుటుంబం అనే భావనను, దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహాగురువు స్వామి వివేకానంద అని, వారు ఆశించినట్టుగా భారత్ ప్రపంచానికి విశ్వగురువుగా నిలవాలంటే ఉక్కు నరాలు ఇనుప కండరాలు వజ్ర సంకల్పం కలిగిన యువత సామాజిక స్పృహతో ఈ దేశం నా ఇల్లు అంటూ సమాజమే నా కుటుంబం అనే ఆలోచనలతో సమాజ సేవకై ముందుకు నడుస్తూ ప్రపంచానికి విశ్వగురువుగా భారత్ ను నిలిపే ఈ ప్రయాణంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాహుల్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, నగర ఉపాధ్యక్షుడు రాజు, సంయుక్త కార్యదర్శి అంజి, శిరీష, అశ్విని విద్యార్థులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద...

- ఎమ్మెల్యే మట్టా రాగమయి
- సత్తుపల్లిలో జయంతి వేడుకలు
- స్వచంద సేవకులకు సత్కారం





చర్చ, సత్తుపల్లి:యువతకు స్ఫూర్తి ప్రదాత, భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానందుని జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్.మట్టా రాగమయి అన్నారు. సోమవారం పట్టణ శివారులో గల వివేకానంద కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఆమె నివాళులు అర్పించారు.రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.లక్ష్యం దిశగా కృషి చేస్తే విజయం తప్పని సరిగా వరిస్తుంది.
నిజాయితీ, ధైర్యం, నమ్మకం, శ్రమ ఉంటే విజయం తప్పక వరిస్తుందని వివేకానంధుడు చేసిన బోధనలు గుర్తు చేశారు.

### స్వచంద సేవకులకు సత్కారం

స్వామి వివేకానంద 164 వ జయంతి ( జాతీయ యువజన దినోత్సవం ) పురస్కరించుకొని రామకృష్ణ సేవాసమితి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచంద సంస్థల యువతను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు.సన్మానం పొందిన వారిలో యువభారత్ శక్తి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు క్రాంతి కుమార్, యువసేవ సమితి నిర్వాహకులు జొన్నలగడ్డ రాజు, ఉదయ్ కుమార్, సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవికుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమములో జి ఆర్ మఠానికి చెందిన దేవనాద్ జి ఆర్ స్వామీజీ పాల్గొని పాల్గొని స్కూలు కాలేజీ కరస్పాండెంట్స్ మరియు హెడ్మాస్టర్స్ తో సమావేశమై విద్యార్థులలో సృజనాత్మకతను పెంచే సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, రామకృష్ణ సేవాసమితి నిర్వాహకులు చలగుళ్ల శ్రీనివాసరావు, గట్టి వాసు, చీకటి శ్రీనివా సరావు, చల్లగుల్ల అప్పారావు, పసుపులేటి నాగేశ్వరరావు, నాయుడు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు .రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ తదితర సంస్థల ప్రతినిధులు వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు


**సిపి అంబర్ కిషోర్ ఝా వెల్లడి**



చర్చ,గోదావరిఖని:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి,మంచిర్యాల జోన్‌లలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పేకాట,కోడిపందాలు, ఇతర చట్టవ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు, నాకాబందీలు నిర్వహించడంతో పాటు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించిన కీలక ప్రదేశాలలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ సరిహద్దు జిల్లాలు మరియు ఇతర రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్‌లతో సమన్వయం ఏర్పాటుచేసి సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేకాట,కోడిపందాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉం చుతామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# స్వామి వివేకానందుని జీవితం యువతకు అత్యంతప్రేరణాదాయకం

- నాయుడురాఘవరావు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి



చర్చ, సత్తుపల్లి:భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ మరియు సత్తుపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయిలి.బీజెపి నాయకులు సత్తుపల్లి పట్టణ శివారులో ఉన్న వివేకానందస్వామి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం యువతకు ప్రేరణాదాయకం అని, స్వామి వివేకానంద బోధనలు యువతకు తారకమంత్రంగా పనిచేస్తాయనిచికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో భరతజాతి గొప్పతనాన్ని, దేశ సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన ధీరుడు వివేకానంద అని, చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావనలతో పెరిగారని,ఈ క్రమంలోనే పూజ్య రామకృష్ణ పరమహంస దగ్గరకు చేరి, భగవంతుని దర్శించిన అనుభూతి చెందారని, రామకృష్ణ పరమహంస వివేకానంద ను చూడగానే,ఈ వ్యక్తితోనే భవిష్యత్తులో భారత దేశానికి కీర్తి ప్రతిష్టలు వస్తాయని గ్రహించి తన విజ్ఞానాన్ని అందించడం జరిగిందని, రామకృష్ణ పరమహంసకు ప్రియ శిష్యుడు అయ్యారని,ఆ విధంగా స్వామి వివేకానంద తత్వవేత్తగా, ఆధ్యాత్మికవేత్త గా దేశానికి ఎనలేని సేవ చేసారని, వారు చూపించిన బాటలో అందరం నడుద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జొన్నలగడ్డ నరేష్,పట్టణ ప్రధాన కార్యదర్శి కార్తీక్ యాదవ్, నాయకులు చీకటి వసంతరావు,మేరుగు శేషగిరిరావు, సాయి సందీప్ మరియు సీనియర్ నాయకులు గట్టే. వాసు తదితరులు పాల్గొన్నారు.

## అయితా శంకరయ్య భవన్ సిపిఐ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం

**ఎర్ర జెండాలతో భారీ ప్రదర్శన**




చర్చ : ప్రతినిధి కుక్కునూరు :కుక్కునూరు: మండల కేంద్రంలో అయితా.శంకరయ్య భవన్ (సీపీఐ కుక్కునూరు నూతన మండల కార్యాలయం) ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మహాప్రదర్శన నిర్వహించారు.కుక్కునూరులోని సినిమాహాల్ సెం టర్ నుంచి పార్టీ కార్యాలయం వరకు ఎర్రజెండా నినాదాలతో భారీ ప్రదర్శన కొనసాగింది.ఈ కార్యక్రమానికి కుక్కునూరు, వేలేరు పాడు మండలాల నుంచి ఆ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. కాగాఎర్రజెండాలతో జరిగిన ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. ప్రదర్శనలో సీపీఐ అతిరథులు పాల్గొన్నారు.

# "స్మార్ట్ ఫోన్ కాదూౌస్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి

- "వైఫై కాదూ విల్ పవర్ పెంచుకోండి"
- మీలోని బలహీనతలను విడిచిపెట్టడండి
- భయాన్ని మనసులోకి రానీయకండి
- స్వామి వివేకానందుడి స్ఫూర్తితో దేశం కోసం పనిచేయండి
- జాతీయ యవజన దినోత్సవంలో యువతకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు
- కేంద్ర మంత్రి చేతుల మీదుగా పలువురికి స్పోర్ట్స్ కిట్స్ అందజేత






చర్చ :-బ్యూరో కరీంనగర్ :"మీరంతా "స్మార్ట్ ఫోన్ కే పరిమితం కావొద్దు. స్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి!" "వైఫై కాదూ విల్ పవర్ పెంచుకోండి! ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండి ...అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి. మీ కోసం, మీ కుటుంబం కోసం కాకుండా దేశం కోసం పనిచేయాలి"అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ యువతకు పిలుపునిచ్చారు. భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించడమే కాకుండా భారతీయ సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని, నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు యువతకు తారక మంత్రంగా పనిచేస్తాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని కళాభారతిలో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బండి సంజయ్ తోపాటు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా యువజన అధికారి రాంబాబు, జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా పలువురికి 'స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. అంతకుముందు బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు....భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించిన వ్యక్తి. భారతీయ సమాజాన్ని జాగృతం చెయ్యడమే కాకుండా యోగ, వేదాంత శాస్త్రాలను ప్రపంచ వ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద. నిరాశలో ఉన్న యువతను తట్టి లేపేందుకు ఆయన చెప్పే మాటలు మనకు ఎప్పటికీ తారక మంత్రంగా పనిచేస్తాయి."నీ వెనుకాల ఏముంది.. ముందేముంది అనేది నీకు అనవసరం. నీలో ఏముంది అనేది ముఖ్యం. మందలో ఒకరిగా ఉండొద్దు. వందలో ఒకరిగా ఉండడానికి ప్రయత్నించండి." అంటూ స్వామి వివేకాంద చెప్పిన మాటలు యువతలో ప్రత్యేకతను వెలికి తీసేందుకు పనికొస్తాయి. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పమున్న యువతను 100 మందిని ఇవ్వండి. ఈ దేశ తలరాతనే మార్చేస్తానంటూ స్వామి వివేకానంద చెప్పిన మాటలను చూస్తే... భారతీయ యువత శక్తి సామర్థ్యాల మీద ఆయనకు ఎంత గట్టి నమ్మకం ఉందో అర్థం చేసుకోవాలి. కానీ ఈ రోజు యువత పరిస్థితి బాధాకరం...చేతిలో మొబైల్, ఇంటర్నెట్, ఆన్ లైన్ గేమ్స్... మద్యం, డ్రగ్స్ కు బానిసలవుతున్నారు. విదేశాలన్నీ భారత్ ను ఫాలో అవుతుంటే... మనం మాత్రం మోడరన్ కల్చర్ పేరుతో విదేశీ కల్చర్ ను అలవాటు చేసుకుంటున్నం.. మీరంతా "స్మార్ట్ ఫోన్ కాదూౌస్మార్ట్ మనస్సును తయారు చేసుకోండి!" "వైఫై కాదూ విల్ పవర్ పెంచుకోండి!" మీలో ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకోండి ...అన్యాయం జరిగితే ఎదిరించే శక్తి పెంచుకోండి. నీ కోసం కాదూౌదేశం కోసం బతికే ఆలోచనను మనసునిండా నింపుకోండి. ఎందుకంటే "ఈ దేశానికి బలహీనులు కాదూౌబలవంతులు కావాలి!" చరిత్ర సృష్టించే వారిగా మారండి. తల్లి భారత మాత అత్యున్నతమైన సింహాసనం మీద కూర్చుని ఉన్న దృశ్యాన్ని నేను ప్రత్యక్షంగా చూశానని 1897లోనే స్వామి వివేకానంద చెప్పారంటే ఆయనలో ఎంతటి అద్భుతమైన విజన్ ఉందో అర్థం చేసుకోవచ్చు. స్వామిజీ కన్న కలలను నేడు "వికసిత్ భారత్-2047" విజన్ డాక్యుమెంట్ రూపంలో భారత్ ను విశ్వగురు స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీజీ అహర్నిశలు క్రుషి చేస్తున్నారు. ఆర్ధిక ప్రగతిలో 11వ స్థానంలో ఉన్న భారత్ ను 4వ స్థానంలో నిలిపారు. 25 కోట్ల మందిని పేదరికం నుండి గట్టెక్కించారు.యువత అభివృద్ధి, సంక్షేమం, క్రీడల కోసం మోదీజీ ప్రత్యేకంగా ద్రుష్టి పెట్టారు. యూపీఏ పాలనలో క్రీడా బడ్జెట్ 1640 కోట్లు మాత్రమే...మోదీ పాలనలో నేడు క్రీడల కోసం 3,794 కోట్ల రూపాయలు కేటాయించారు. మోదీ ప్రత్యేక ద్రుష్టి పెట్టడంవల్లే ఒలింపిక్స్, కామన్ వెల్త్, ఏసియన్ గేమ్స్ లో అనేక పతకాలను సాధించగలిగాంఉద్యోగాల విషయానికొస్తే....ఒక్క ఏడాదిలోనే 10 లక్షల మందికి అవినీతి, పైరవీలకు ఆస్కారం లేకుండా మెరిట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా పేరుతో యువతను పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా, ఐటీ యజమానులుగా తీర్చిదిద్దుతున్నారు. గత 10 ఏళ్లలో స్టార్టప్ ఇండియా ద్వారా 1 లక్షా 59 వేల 157 మంది సొంతంగా స్టార్టప్ లు స్థాపిస్తామని కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకోవడమే కాకుండా ఇప్పటి వరకు 10 లక్షల మందికిపైగా ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా గత పదేళ్లలో 1 కోటి 70 లక్షల మందికి స్కిల్ డెవలెప్ మెంట్ కోర్సుల్లో శిక్షణనందించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చదువులోనే కాదు క్రీడల్లోనూ సత్తా చాటేందుకు ప్రయత్నించండి. భవిష్యత్తుపై ఒక లక్ష్యాన్ని ఎంచుకోని పనిచేయండి. దేశం కోసం నిలబడండి. ధర్మం కోసం పనిచేయండి. అన్యాయాన్ని ఎదురించండి. దేశాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి. డ్రగ్స్ పెడ్లర్స్ సమాచారం తెలిస్తే ప్రభుత్వానికి సమాచారమివ్వండి. దయచేసి మీలోని బలహీనతలను విడిచిపెట్టడండి. భయాన్ని మనసులోకి రానీయకండి. భారతీయుడిగా గర్వంగా నిలబడండి...అదే స్వామి వివేకానందుడికి మనం అందించే ఘనమైన నివాళి.



## ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులైన ఉపాధ్యాయులకు


- ఎన్నికల విధుల మినహాయింపు కోరుతూ
- కేంద్ర మంత్రికి వినతిపత్రం



చర్చ :-బ్యూరో కరీంనగర్ :కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న తల్లిదండ్రులైన ఉపాధ్యాయులకు రానున్న మున్సిపల్ ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ (సెటా) రాష్ట్ర ప్రధానకార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి భారత ప్రభుత్వ హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు నిరంతర పర్యవేక్షణ, థెరపీ, మందులు, భావోద్వేగ భద్రత తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న పిల్లల తల్లిదండ్రులైన ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు నియమించడం వల్ల పిల్లల అభివృద్ధి, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేంద్ర మంత్రి కి వివరించినట్లు తెలిపారు.ఈ విషయంపై మంత్రివర్యులు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి అట్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.పస్. జిల్లా బాధ్యులు ముదిగంటి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## మహంకాళి టైక్వాండో నేషనల్ ఛాంపియన్షిప్‌లో బెల్లంపల్లి విద్యార్థుల ప్రతిభ

- సిల్వర్ మెడల్స్ సాధించిన రైల్వే ఇన్స్టిట్యూట్ టైక్వాండో క్రీడాకారులు





చర్చ బెల్లంపల్లి : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయిని నగరంలో గల తలారి మాత్ స్టేడియంలో నిర్వహించిన మహంకాళి టైక్వాండో నేషనల్ ఛాంపియన్షిప్లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన టైక్వాండో విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.ఈ పోటీల్లో పాల్గొన్న బెల్లంపల్లి రైల్వే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రమోద్ కుమార్, జి. శ్రేనిత్ సాయి తమ ప్రతిభను చాటుతూ జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు.మెడల్స్ సాధించిన విద్యార్థులను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, రైల్వే ఏడీఈఎన్ గోపి, టైక్వాండో రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో విజయం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

అలాగే ఈ విజయం వెనుక కీలక పాత్ర పోషించిన టైక్వాండో కోచ్ జై అజయ్ను కూడా వారు ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.బెల్లంపల్లి నుంచి జాతీయ స్థాయికి చేరి మెడల్స్ సాధించడం పట్ల క్రీడా ప్రేమికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పట్టింపు లేని అధికారులు పనిచేయని సిబ్బంది



చర్చ, కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణం, మున్సిపాలిటీ పరిధిలోని 28 వ వార్డులో పైప్ లైన్ పగిలి నీరు ఏరియాలోని ఇండ్ల ముందుకు చేరి ఏరియా లోని జనానికి ఇబ్బంది కలిగిస్తుంది. దీనిపై మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న వినిపించుకున్న దాఖలు లేవు. యధారాజ తథ ప్రజా అనే వైఖరి లాగ అధికారులకే లేని బాధ్యత మాకెందుకు అన్నట్లుగా సిబ్బంది వైఖరి కనిపిస్తున్నది. ప్రతి అవసరానికి పన్నులు చెల్లించి వినియోగిం చుకోవా లని చెప్పే మున్సిపాలిటీ, పగిలిన నాణ్యత లేని పైపులైన్ సమస్యపై బాధ్యత తీసుకుంటుందా? దీనిపై తక్షణమే చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరిస్తుందా అని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## ప్రమాదంలో గాయపడిన విలేఖరి రాంబాబు ను పరామర్శించిన కాంగ్రెస్ నేత



చర్చ, సత్తుపల్లి: సత్తుపల్లి లో వేంసూరు రోడ్ లో గల రాణి ఫంక్షన్ హాల్ నందు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ర్యాలీలో పాల్గొని మోటార్ బైక్ మీద తిరిగి వస్తూ ఉండగా రోడ్డు క్రాస్ అయ్యే క్రమంలో విజయవాడ వెళుతున్న కారు స్పీడ్ గా వచ్చి బైక్ ను ఢీ కొట్టిన ప్రమాదంలో గాయపడిన ప్రజా గొంతుక విలేఖరి నల్లంటి రాంబాబును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ మట్టా దయానంద్ పరామర్శించారు. బైక్ ను బలంగా ఢీకొనడంతో రాంబాబు వెన్నుపూసకు బలమైన గాయాలు తగిలాయి, కాలు ఫ్యాక్చర్ అయింది. ఆ సమయంలో స్పృహ తప్పి పడిపోయాడు వెంటనే అక్కడ ఉన్నవారు వచ్చి లేపి స్థానిక రఘురాం హాస్పిటల్ లో జాయిన్ చేశారు. వెన్నుపూసకి బలంగా దెబ్బ తగలడంతో ఎక్స్ రే తీసినారు. బాగా నొప్పి రావడంతో ఖమ్మం తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. ఖమ్మంలో వేద హాస్పిటల్లో ఎంఆర్ఐ సిటీ స్కానింగ్ తీసారు.బ్యాక్ సైడ్ వెన్నుపూస బాగా కదిలి బాగా ఉబ్బింది. స్వెల్లింగ్ వస్తుందని, డాక్టర్ తెలియజేశారు. రెండునెలలు రెస్ట్ తీసుకోవాలని తెలిపారు. డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సిద్ధారం గ్రామం వచ్చి రాంబాబును పరామర్శించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం ఇచ్చారు. హాస్పిటల్ లో తీసిన స్కానింగ్ ఎక్స్ రే,ఎంఆర్ఐ రిపోర్టులను పరిశీలించారు.రెస్ట్ తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల కమిటీ నాయకులు సిద్ధారం కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కారుకూరి రామచందర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని
- ముట్టడించిన జర్నలిస్టులు
- "డెమోక్రసీగా మాట్లాడదామా.. నాన్ డెమోక్రసీగా మాట్లాడదామా"ఎమ్మెల్యే గడ్డం వినోద్



చర్చ బెల్లంపల్లి:ఎన్టీవీ జర్నలిస్టు అందుగుల రమేష్‌ను దూషించిన మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు కార్కూర్ రామచందర్‌ను పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లిలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు.సోమవారం ఏఎంసీ ఏరియా నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి, రామ్ చందర్ ను పార్టీని సస్పెండ్ చేయాలని, తీసుకోవాలని, జర్నలిస్టుల ఐక్యత, ఎమ్మెల్యే స్పందించాలని, నినాదాలు చేశారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ శ్రీనివాసరావు లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్ బయటకు వచ్చి జర్నలిస్టులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"డెమోక్రసీగా మాట్లాడదామా.. నాన్ డెమోక్రసీగా మాట్లాడదామా? మీరు చెప్పండి, నేను దేనికైనా సిద్ధమే" అంటూ వ్యాఖ్యానించారు. జర్నలిస్టులు దేనికైనా సిద్ధమని అన్నారు, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యను పరిష్కరించాలని కోరారు. రామచందర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ జర్నలిస్టులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ జర్నలిస్టులకు హామీ ఇచ్చారు,ఈ ఆందోళన కార్యక్ర మంలో బెల్లంపల్లి నియోజక వర్గంలోని బెల్లంపల్లి,కాసిపేట, తాండూరు, భీమినీ నెన్నెల, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లోనీ జరలిస్టులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పురస్కరించుకొని పదోవయువజన ఉత్సవాలు

- శారీరక మానసిక ఉల్లాసానికి ఆటలు పోటీలు
- ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయం
- విజయవంతంగా ముగిసిన సంక్రాంతి 10వ యువజనోత్సవాలు
- గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం చేసిన ఎస్.ఐ రాజారెడ్డి





చర్చ : ప్రతినిధి కుక్కునూరు :కుక్కునూరు జనవరి 12 :యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు శ్రీ మండవ రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వారి కుమారుడు మండల శ్యాంసు oదర్ రెడ్డి సహకారంతో వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎ ఫ్ఐ ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహిoచడం అభినందనీయమని ఎస్ఐ రాజారెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండవ రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో యువత కోసం నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, షటిల్, కబడ్డీ, మహిళల కోసం ముగ్గులు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు సోమవారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ యర్రం సాయికిరణ్ అధ్యక్షతన జరిగిన బహుమతులు ప్రదానోత్సవం సభలోఎస్.ఐ రాజారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు మోడియం నాగమణి మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని యువతి యువకులు కోడిపందాలు జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకుండా ఉండేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ భవిష్యత్తులో మండల రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వారి కుమారుడు మండల శ్యాంసుందర్ రెడ్డి సహకారంతో ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయం అని కొనియాడారు. అనంతరం మండలంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మండల మొదటి ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులు కే. తరుణ్ అన్వేష్ రాజ్ లకు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ముగ్గుల పోటీలో మొదటి బహుమతి మేఘనకు, ద్వితీయ బహుమతి సాయితేజకు, వాలీబాల్ మొదటి బహుమతి ఆసుపాక,ద్వితీయ బహుమతి మద్దిగట్ల షటిల్, మొదటి బహుమతి కుక్కునూరు,ద్వితీయ బహుమతి వేలేరుపాడు కబడ్డీ మొదటి బహుమతి మాధవరం,ద్వితీయ బహుమతి బంజంగూడెం క్రికెట్, మొదటి బహుమతి షాకిర్ కుక్కునూరు,ద్వితీయ బహుమతి మోహిద్దీన్ కుక్కునూరు,గిరిజన రేల డ్యాన్స్,ముగ్గులు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలలో గెలుపొందిన విజేతలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, జనసేన మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్,ములిశెట్టి జయంత్ డివైఎఫ్ఐ నాయకులు పూలదాస్ రమేష్,గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు కాక ఆనంద్, సిఐటియు సీనియర్ నాయకులు మహబూబ్ పాషా,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేడిపల్లి బాబు,శ్లోక స్కూల్ యాజమాన్య సుజాత,న్యాయవాది సత్యవాణి, కోకో కంపిని ఉద్యోగి ప్రదీప్ చేతుల మీదుగా బహుమతులు, నగదు అందించారు.

## దేశ అభివృద్ధి,పంచాయితీ అభివృద్ధిలో కీలక పాత్ర సర్పంచ్ లదే- ఎమ్మెల్యే కూనంనేని

- తండా పంచాయితీని తండా అభివృద్ధి బోర్డుగా ఏర్పాటు చేయాలి
- తండా పంచాయితీని రెవిన్యూ పంచాయితీగా గుర్తించాలి
- ఏజెన్సీ చట్టాలను, జిఓ 3 స్థానంలో కొత్త జిఓ రావడంలో సర్పంచ్ లు భాగస్వామ్యం కావాలి
- ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, జీఎల్ఎస్ జాక్ చైర్మన్




చర్చ, కొత్తగూడెం:గిరిజన లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జి.ఎల్.ఎస్ జెఏసి ఆధ్వర్యంలో ఘనంగా గిరిజన లంబాడి సర్పంచ్–ఉప సర్పంచ్ ల సన్మాన మహెూత్సవ అభినందన సభ సోమవారం ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కునంలేని సాంబశివరావు హాజరై మాట్లాడుతూ నూతన సర్పంచ్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి సర్పంచ్లు తండాల అభివృద్ధికి కృషి చేయాలని దేశ సమాగ్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించి గ్రామపంచాయతీలో పాలుపంచుకోవాలని ,ప్రతి సమస్యను దగ్గరుండి సమస్య పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని అన్నారు.ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ జాక్ చైర్మన్ మాట్లాడుతూ తండా పంచాయితీని తండా అభివృద్ధి బోర్డుగా ఏర్పాటు చేయాలని, తండా పంచాయితీని రెవిన్యూ పంచాయితీగా గుర్తించాలని, ఏజెన్సీ చట్టాలను, జిఓ 3 స్థానంలో కొత్త జిఓ రావడంలో సర్పంచ్ లు భాగస్వామ్యం కావాలని అన్నారు.

గిరిజన చట్టాలైన పెస చట్టం పరిరక్షణ ఏజెన్సీలో 100 % రిజర్వేషన్ల విద్యా ఉద్యోగాల్లో గిరిజన్లో వాటా వారికి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలోని యువత గంజాయికి బానిస కాకుండా చూడాలని గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాష , ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు రాజేష్ నాయక్ .జాక్ సెక్రటరీ జనరల్ రమేష్, న్యాయవాది బానోత్ రమేష్ నాయక్ , వైస్ చైర్మన్ లు లావుడియా ప్రసాద్ నాయక్, మాలోత్ విగ్నేష్ నాయక్, లాకావత్ వెంకటేశ్వర్లు, బట్టు జుంకీ లాల్ నాయక్ , బోడా లాలు నాయక్ గూగులోతు కృష్ణ నాయక్, భూక్యా వెంకట్ నాయక్, హథీరాం నాయక్, జీ .శ్రీనివాస్ నాయక్, జేఏసీ అధికార ప్రతినిధిలు రవి రాథోడ్ ,లావూరి శ్రీనివాస్ నాయక్, చుంచుపల్లి మండలం మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి బాయి, బాదావత్ సీతారాం, ధరావత్ ప్రేమ్ చంద్ నాయక్ నాయక్ ,+ూా –జీూజ కోశాధికారి మంగీలాల్ నాయక్, జనరల్ సెక్రటరీ మోహన్ నాయక్, గూగులోతూ దేవిలాల్ నాయక్, జాక్ ప్రధాన కార్యదర్శులు నువ్వునావత్ రాంబాబు నాయక్ , సురేష్ నాయక్, దుర్గాప్రసాద్ నాయక్, నూనావత్ బాలాజీ నాయక్, బర్మావత్ హరి నాయక్, జరుపులా లచ్చు నాయక్, భూక్య లక్ష్మణ్, బిచ్చ నాయక్ , నాగేశ్వరరావు పాడియా, ఉపేందర్ నాయక్, జాయింట్ సెక్రటరీలు భూక్యా శ్రీను, భానోత్ సేవ్య నాయక్, బానోతు కిషన్ నాయక్, మాలోత్ బాలు, వంకుడోత్ రమేష్ బాబు, ధరావత్ నాగరాజు నాయక్ , ఆర్గనైజింగ్ సెక్రటరీలు శీను నాయక్ బాలు, నాయక్, సక్రూ నాయక్, లావుడియా పూర్ణ నాయక్, శ్రీనివాస్ నాయక్ రాజ్ కుమార్ నాయక్, రాంసింగ్ నాయక్, సురేష్ నాయక్, బాబు రావు నాయక్, రూప్ల నాయక్, భట్టు హుస్సేన్ నాయక్, అనిల్ నాయక్, మీడియా సెక్రెటరీ పూర్ణచంద్ర నాయక్, వినోద్, నాగ రాజు నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో సుమారు 200 మంది లంబాడి సర్పంచులు ఉపసర్పంచ్లు పాల్గొన్నారు.వందల మంది లంబాడి ప్రముఖులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సెలవుల్లో దొంగతనాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

- ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ కే. శ్రీనివాసరావు



చర్చ బెల్లంపల్లి:సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు తమ సొంత గ్రామాలకు ప్రయాణిస్తున్న నేపథ్యంలో దొంగతనాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ కే. శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు.

సెలవుల సమయంలో ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే వారి సంఖ్య పెరుగుతుండటంతో దొంగతనాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఖరీదైన బంగారు ఆభరణాలు, నగదును ఇంట్లో ఉంచుకొని ప్రయాణించవద్దని, అవసరమైతే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.ఇంటిని విడిచి వెళ్లే ముందు ఎలాంటి విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా, పగడ్బందీగా తాళాలు వేసుకొని వెళ్లాలని తెలిపారు. అలాగే ఇంటి పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, లేదా దొంగతనం జరిగే అవకాశం ఉందని భావించినా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.సెలవులకు వెళ్లే ముందు తమ బీట్ ఆఫీసర్‌ను లేదా పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే, ఆ ప్రాంతంలో పోలీసు పెట్రోలింగ్‌ను పెంచే అవకాశం ఉంటుందని, దీని ద్వారా దొంగతనాలను ముందుగానే నివారించవచ్చని సీఐ తెలిపారు.దొంగతనాలను గుర్తించడంలో సీసీటీవీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ, ప్రజలు తమ ఇళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.

ఇంటి ఆవరణలో గానీ, చుట్టుపక్కల గానీ ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పట్టణ ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటిస్తూ, ఎలాంటి దొంగతనాలకు తావు లేకుండా పోలీసులకు సహకరించాలని సీఐ కే. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# ఆంధ్రుల జీవనాడి ప్రాజెక్టు పోలవరం

- వలస గిరిజనులపై పట్టింపు లేదు
- అమ్మకానికి ప్రభుత్వ ఆస్తులు
- చిత్తశుద్ధి లేని ప్రభుత్వాలు
- మునిగే వారికి మునిగేచోట నిర్మాణం
- త్యాగధనులకు తీరని ద్రోహం
- ఎర్ర సముద్రంగా మారనున్న ఖమ్మం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల.ఈశ్వరయ్య..







**చర్చ : ప్రతినిధి కుక్కునూరు :**కుక్కునూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెన్నుముక, జీవనాడియిన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం బ్యారేజ్ గా మార్చిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో నూతనంగా నిర్మించిన అయితా శంకరయ్య సిపిఐ కార్యాలయం భవనాన్ని సోమవారం రాష్ట్ర కార్యదర్శి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా మండల ప్రధాన కేంద్రంలో 400 మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు .అనంతరం పార్టీ కార్యాలయం వద్ద జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె.లక్ష్మయ్య సభా అధ్యక్షతన కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడా రు.లక్షల ఎకరాల భూమికి సాగునీరు, రాష్ట్ర నలుమూల త్రాగునీరు, విద్యుత్ అందిస్తూ బహుళార్థకంగా ఉపయోగపడే పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తూ బ్యారేజ్ గా మార్చిందని న్నారు. సుమారు 33 వేల కోట్ల పరిహారం నిర్వాసితులకు ఇవ్వకుండా ఎగొట్టానికి కూటమి ప్రభుత్వం మొదటి దశ రెండో దశ అంటూ కొత్త పాట పాడుతుందన్నారు. పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం చేపడితేనే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు అన్ని విధాలుగా అండగా ఉండాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టపోతున్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఉపాధి లేక తాత్కాలికంగా ఊరు వదిలి వెళ్ళిన నిర్వాసితులను నాన్ లోకల్ గా ప్రకటించి సుమారు 5000 మందికి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం వలన ముంపుకు గురవుతున్న నిర్వాసితులకు మునిగే చోటే పునరావాసం కల్పిస్తున్నారని అన్నారు.వెంటనే అన్ని అర్హతలు ఉన్న వారికి ప్యాకేజీ వర్తింపచేయాలన్నారు.

**25 ఏళ్ళైనా కుల ధ్రువీకరణ లేదు :**

వివిధ చోట్ల నుండి వచ్చిన వలస గిరిజనులకు 25 ఏళ్ళైనా కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడం ప్రభుత్వాల పనితీరుకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగిన పట్టించుకున్న నాధుడే కరవ-య్యారన్నారు. అటవీను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూమికి హక్కు పత్రాలు ఇవ్వడం లేదన్నారు. 1500 మంది హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే 40 మందికి పట్టాదారు పుస్తకాలు వచ్చాయని వాపోయారు. ప్రతి గిరిజన కుటుంబానికి న్యాయం జరిగే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రజా సంపదను అమ్మకానికి పెట్టారన్నారు. 17 మెడికల్ కాలేజీ లను పి. పి. పి పద్ధతి అంటూ వ్యాపారం చేసుకోమని ప్రభుత్వాలు దారి చూపించాయన్నారు. చిత్తశుద్ధి లేని పరిపాలన వలన ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రజా శ్రేయస్సు కొరకు ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు.

**సర్వే తప్పులతడక:–**

జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన ముంపుకు గురవుతున్న గ్రామాలను గుర్తించటానికి చేసిన సర్వే తప్పులతడక అన్నారు. కనీస అవగాహన లేని అధికారులతో సర్వే చేయించడం వలన నిర్వాసితులు నిండా మునిగారని ఆగ్రహించారు. పదేళ్లుగా జరిగిన తప్పును పదేపదే అధికారులకు ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తున్న సరిదిద్దలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కంపెనీలకు కాపలా కాస్తున్న ప్రభుత్వాలకు నిర్వాసితులు కనిపించడం లేదన్నారు. కుకునూరు వేలేరుపాడు మండలాల్లోని వేల కుటుంబాలు నష్టపోతున్న ప్రభుత్వానికి పట్టనట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకొని రాష్ట్ర అభివృద్ధికి సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు అన్ని విధాలా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేగ ప్రభాకర్ మాట్లాడుతూ :–** విలీన మండలాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టనట్లుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మండల స్థాయి నుండి జిల్లా రాష్ట్ర స్థాయి వరకు రహదారి దిగ్బంధాలు, ముట్టడులు, ధర్నాలు, నిరసనల కార్యక్రమాలతో నిర్వాసితులకు న్యాయం చేయాలని పోరాటాలు చేసిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. వాటి వలన కొంతవరకు న్యాయం జరిగిన భవిష్యత్తులో అనేక సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించాల్సి ఉందన్నారు. విలీన మండలాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు.

జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కనీస వసతులు సౌకర్యాలు లేక మారుమూల మండలాలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెద్ద వాగు ప్రాజెక్ట్ తెగిపోవడం వలన సకాలంలో నీరు అందక పంటలు పండటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అలసత్వం వహిస్తు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వాలకు పోరాటాలతో సమాధానం ఇవ్వాలన్నారు. విలీన మండలాల్లోని ప్రతి కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందన్నారు.

**ఎర్ర సముద్రంగా ఖమ్మం :–** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతజయంతి వేడుకల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మంలో నిర్వహించే జాతీయ స్థాయి మహాసభతో ఖమ్మం పట్టణం ఎర్ర సముద్రంగా మారనుందని నాయకుల పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కమ్యూనిస్టులు ఎదగాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ఖమ్మం మహాసభ ఉంటుందన్నారు. విలీన మండలాల నుండి వేల సంఖ్యలో ఖమ్మం మహాసభకు తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బండి. వెంకటేశ్వర్లు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి. హేమ శంకర్, ఏపీ గిరిజన రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు కారం. దారయ్య, జిల్లా సమితి సభ్యులు అయితా. సురేష్ బాబు, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు అధ్యక్షు రాలు వరకా. శ్యామల, వేలేరుపాడు కార్యదర్శి బాడిస. రాము, కుక్కునూరు మండల కార్యవర్గ సభ్యులు మైసాక్షి. వెంకటా చారి, కుక్కునూరు సహాయ కార్యదర్శి కూరకుల. బాబూరావు , గిరిజన సంఘం నాయకులు వరసా. పాపారావు, అలవాల. సీతారా మిరెడ్డి, సోడే. నాగేష్, పల్లెల. భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# బీఆరెస్ సన్నాహక సమావేశం

- ఈ నెల 19న కరీంనగర్‌కు కేటీఆర్
- సర్పంచుల సమావేశానికి హాజరుకానున్న కేటీఆర్
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో నేతల పిలుపు



**చర్చ, కరీంనగర్ ప్రతినిధి:–** త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఘన విజయం వైపు నడిపించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ 'చింతకుంట' బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో గంగుల మాట్లాడారు. ఈ నెల 19న కరీంనగర్‌లో జరిగే సర్పంచుల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో పార్టీ కార్యాచరణపై చర్చించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్, జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండిలో గత 45 ఏళ్లలో జరగని అభివృద్ధి జరిగిందని గంగుల కమలాకర్ అన్నారు. తమ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులే ఎన్నికల్లో తమ ఆయుధమని, ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కే ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో మరోసారి నిరూపించాలని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల స్థానిక ఎన్నికల్లో ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలు వచ్చాయని, అదే జోరు మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వి. సతీష్ కుమార్, సుంకె రవి శంకర్, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్ రావు, కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామ కృష్ణ రావు, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ,మాజీ ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ జడ్పీచైర్మన్ తుల ఉమ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి యువ న్యాయవాదుల దినోత్సవ వేడుకలు




**చర్చ, కొత్తగూడెం లీగల్ సెల్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ మరియు న్యాయవాది పరిషత్, కొత్తగూడెం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం కొత్తగూడెం బార్ అసోసియేషన్ హాల్లో స్వామి వివేకానంద జయంతి మరియు యువ న్యాయవాదుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీ కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ,స్వామి వివేకానంద భారతదేశ యువతకు ఆత్మవిశ్వాసం, ధైర్యం, దేశభక్తి నింపిన మహనీయుడని పేర్కొన్నారు. "లేచి నిలబడండి, మీ లక్ష్యాన్ని సాధించే వరకు ఆగకండి" అనే వివేకానందుని సందేశం యువ న్యాయవాదులకు మార్గదర్శకమని అన్నారు. న్యాయవాదులు సమాజానికి న్యాయం అందించే బాధ్యత కలిగిన వారుగా నిజాయితీ, నైతిక విలువలతో వృత్తిని కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జిలు శ్రీమతి ఎ. సుచరిత, శ్రీ బి. రవికుమార్, శ్రీ వి. వినయ్ కుమార్ , స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు లు పాల్గొని స్వామి వివేకానంద జీవిత ఆదర్శాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ, స్వామి వివేకానంద బోధనలు నేటి యువ న్యాయవాదులకు దిశానిర్దేశం చేస్తున్నాయని, ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావం కలిగి వృత్తిని కొనసాగించాలన్నారు.

ఉపాధ్యక్షులు శ్రీ జి. గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీ భాగం మాధవరావు కూడా ఈ సందర్భంగా మాట్లాడారు.

న్యాయవాది పరిషత్ బాధ్యులు శ్రీ పిల్లి వేణు, శ్రీ వాసరావు, శ్రీ పాతూరి పాండురంగ విటల్, సీనియర్ న్యాయవాదులు, యువ న్యాయవాదులు తదితరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యువ న్యాయవాదులకు స్వామి వివేకానంద జీవిత సందేశాలను గుర్తు చేస్తూ, వృత్తిలో నైతిక విలువలతో ముందుకు సాగేందుకు ప్రేరణనిచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

## వృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి



**చర్చ, కరీంనగర్ ప్రతినిధి:–** డే కేర్ సెంటర్ సేవలను వృద్ధులు వినియోగించుకోవాలని రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రణామ్ పేరిట ఏర్పాటు చేసిన వృద్ధుల డే కేర్ సెంటర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో సోమవారం ప్రారంభించారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్ లో ఏర్పాటు చేసిన వృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.వృద్ధుల మానసిక ఉల్లాసం, భద్రత, సంరక్షణ లక్ష్యంగా ప్రణామ్ల పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లను మంజూరు చేసిందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ డే కేర్ సెంటర్లలో లైబ్రరీ, ఇండోర్ గేమ్స్, టీవీ సదుపాయంతో అందుబాటులో ఉంటాయని వివరించారు. వృద్ధులకు ఉచితంగా స్నాక్స్‌తో పాటు టీ అందిస్తారని తెలిపారు. అలాగే దిన పత్రికలు, పక్ష, మాస పత్రికలు, కథల పుస్తకాలు, మ్యాగజైన్లు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఐఆర్సీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జలపాల శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మిరాజం తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలు




**చర్చ, కొత్తగూడెం:** కొత్తగూడెం లోని శారదకుటీర్ ప్రాంగణం లో గల సేవ భారతి వివేకానంద యువ కేంద్రం నందు అధ్యక్షులు సరంజన అగర్వాల్ మరియు సెక్రటరీ పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమం లో భాగంగా ముఖ్య అతిథి శ్రీ మెండు రాజమల్లు (స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కొత్తగూడెం) వివేకానంద జీవిత చరిత్ర గురించి తెలుపుతు, నేటి సమాజం సన్మార్గం లో నడవాలి అన్న, విలువలతో జీవించాలి అన్న, వివేకానంద బోధించిన ధర్మ మార్గమే అత్యున్నతమైనదిగా తెలియ చేశారు. ప్రపంచంలోనే ఉపయోగకరమైన జనాభా, యువత అత్యధికంగా కలిగిన దేశం, భారత దేశం అని, దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అంటే యువతే ప్రధానం అని కొనియాడరు. అనంతరం ముఖ్య వక్త శ్రీ చేపూరి రామచంద్ర రావు (ఖమ్మం విభాగ్ కార్యవహ) ప్రపంచానిక జ్ఞాన జ్యోతుల తో నింపిన స్వామి వివేకానంద మన దేశం లో జన్మించటం ప్రతి యొక్క భారతీయుడికి గర్వకారణం అని కొనియాడారు. అలాంటి ధర్మాత్ములు నడిచిన నేటి బాలలకు తెలియచేయాలి. దత్తుడి జీవిత చరిత్ర ప్రతి యొక్క విద్యార్థి చదవి సమాజం లో నైతిక విలువలు, సామాజిక విలువలు కలిగి ఉన్నత పౌరులుగా ఎదగాలి అని సూచించారు. కార్యక్రమం అనంతరం వచ్చిన ప్రతి ఒక్కరికి జ్ఞాన ప్రసాదంగా స్వామి వివేకానంద భారత జాతికి ఆశ జ్యోతి అని పుస్తకం తో పాటు మిఠాయిను అందించారు.

ఈ కార్యక్రమం లో భాగంగా పిల్లి రాజేశ్వరరావు, జి.సత్యనారాయణ, మూర్తి, న్యాయవాదులు రాంప్రసాద్ రావు, వేణు వాసురావు, కృష్ణప్రసాద్, లావణ్య, రమేష్ నాయక్, అత్తులూరి మనిష్, నాగేశ్వర రావు బీజేపీ, విహెచ్పి శ్రీధర్, సురేష్(వారాహి), కమిటీ సభ్యులు చందర్ రావు, వెంకటేష్, మదన్ రెడ్డి,పుర ప్రముకులు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవ వేడుకలు



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంతి వర్యులు రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎస్.సి. మరియు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, వికలాంగుల కాపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్ , డైరెక్టర్ శైలజ వర్చువల్ గా, జిల్లా నందు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సంబాశివరావు ప్రణామ్ వయో వృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వయో వయోవృద్ధులు ఒంటరి తనంతో బాధపడుతున్నారని, మానసికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి కాలక్షేపం కొరకు డే కేర్ సెంటర్ నిర్వహించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా మాట్లాడుతూ డే కేర్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నడుస్తుందని, సీనియర్ సిటిజన్స్ కొరకు డే కేర్ సెంటర్ నందు టీవీ, ఇండోర్ గేమ్స్, లైబ్రెరీ, విశ్రాంతి తీసుకొనుటకు సౌకర్యాలు కల్పించామని, స్నాక్స్, పండ్లు అందించబడినని, వయో వృద్ధులు జూఈ సదుపాయాన్ని వినియోగిం చుకోవాలని, ప్రణామ్ వయో వృద్ధుల డే కేర్ సెంటర్ గ్రామ వికాస స్వచ్ఛంద సంస్థ మరియు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నడపబడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతి శ్రీ, గ్రామ వికాస స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సత్య నారాయణ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణయ్య, నాగేశ్వర రావు, జయరామ్, సందీప్, మురళి, సిడిపిఓ పద్మ శ్రీ, ప్రభావతి, పద్మిని, సిబ్బంది వర ప్రసాద్, నరేష్, ప్రవీణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.


## ఓటర్ లిస్టులలో ఇతర ప్రాంత ఓట్లను తొలగించండి కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్యే సంజయ్



**చర్చ, జగిత్యాల :** మున్సిపల్ ఓటర్ లిస్టుల్లో ఇతర ప్రాంతాల ఓట్లు చేర్చినట్లు తన దృష్టికి వచ్చిందని పరిశీలించి సరిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన వినతిపత్రం లో కోరారు. జరుగనున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా తయారు చేస్తున్న ఓటర్ లిస్టులలో ఇతర ప్రాంతాల ఓటర్ల పేర్లు నమోదైనట్లు తన దృష్టికి వచ్చిందని వెంటనే పరిశీలించి సరిచేసి ప్రజలకు అనుమానాలను నివృత్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇచ్చిన వినతిపత్రం లో కోరారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు






చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఫోటో ఓటరు జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఫోటో ఓటరు తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఈ నెల 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రకటన అనంతరం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలన, పరిష్కారం పిమ్మట ఈ నెల 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ ప్రచురణ కొరకు ప్రింటింగ్ ప్రెస్ లను గుర్తించడం వంటి పనులు పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ జారీ లోగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు మున్సిపాలిటీలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకటన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా, తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, సెక్టోరియల్ అధికారులు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క






చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఎండి గణపతి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. అధికారులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించి పోటీ ప్రపంచంలో నిలబడేలా తీర్చిదిద్దే ఉద్దేశంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్. సి., ఎస్. టి., బి. సి రెసిడెన్షియల్ పాఠశాలలలా కాకుండా అందరికీ ఒకే చోట ఉమ్మడి కుటుంబంలా సకల సౌకర్యాలతో పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 79 పాఠశాలలు మంజూరు కాగా 76 పాఠశాలలకు టెండర్లు పూర్తి కాబడి 18 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించాలని, ప్రతి నెలలో కనీసం ఒకసారి పాఠశాలల నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని తెలిపారు. పాఠశాలలు నిర్మాణంలో ఉన్న చోట పనితీరు పురోగతిపై డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం విషయంలో జిల్లా కలెక్టర్లు అలసత్వం ప్రదర్శించకూడదని, పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో పాఠశాలలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో విద్యతో పాటు క్రీడలు, సమాజంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 5 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు కాగా, సంబంధిత పాఠశాలలకు భూమిని కేటాయించడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం, పినపాక, దుమ్ముగూడెం లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అశ్వరావుపేట, ఇల్లందు పాఠశాలల పనులు కూడా త్వరిత గతిన మొదలుపెట్టి వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా స్కూళ్లపై సమీక్ష నిర్వహించిన బట్టి విక్రమార్క

- 2027-28 విద్యా సంవత్సరం నాటికి యంగ్ ఇండియా సమీకృత గురుకులాలలు ప్రారంభించాలి...
- ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పై సమీక్ష
- ప్రపంచంతో పోటీ పడేలా మన విద్యార్థులను సిద్ధం చేయాలి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సిఎం



చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- 2027-28 విద్యా సంవత్సరం నాటికి యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ప్రారంభించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఎండి గణపతిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. అధికారుల కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించి పోటీ ప్రపంచంలో నిలబడేలా తీర్చిదిద్దే ఉద్దేశంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకో వాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసి రెసిడెన్షియల్ పాఠశాలల్లా కాకుండా అందరికీ ఒకే చోట ఉమ్మడి కుటుంబంలా సకల సౌకర్యాలతో పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా 79 పాఠశాలలు మంజూరు కాగా 76 పాఠశాలలకు టెండర్లు పూర్తి కాబడి 18 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతి పై సమీక్ష నిర్వహించాలని, ప్రతి నెలలో కనీసం ఒకసారి పాఠశాలల నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని తెలిపారు. పాఠశాలలు నిర్మాణంలో ఉన్న చోట పని తీరు పురోగతి పై డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకొని, 2027-28 విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ అంశం పై జిల్లా కలెక్టర్లు అలసత్వం ప్రదర్శించకూడదని, పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో పాఠశాలలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో విద్యతో పాటు క్రీడలు, సమాజంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మనీయుడు వివేకానందుడు

- వివేకానందుని జీవితం ఆదర్శప్రాయం
గౌతమీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొండలరావు

చర్చ,చర్ల:భారతదేశ ఔన్నత్యాన్ని దశ దిశల చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద ప్రతి ఒక్క భారతీయునికి ఆదర్శప్రాయుడని గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కొండలరావు అన్నారు. సోమవారం వివేకానంద జయంతి సందర్భంగా వనవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీమ్ విద్యార్థి నిలయంలోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేశారు. ముందుగా వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ గొప్పతత్వవేత్తలు, ఆధ్యాత్మిక నాయకులలో ఒకరైన వివేకానందుని స్మరించుకోవడం ఆనందదాయకం అన్నారు. రామకృష్ణ పరమహంస శిష్యునిగా వేదాంత యోగతత్వ శాస్త్రములతో సమాజంపై అత్యంత ప్రభావం కలిగిన ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక నాయకుడు వివేకానందుడని పేర్కొన్నారు. దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్ లలో యోగ వేద శాస్త్రములను తన ఉపన్యాసాలు, వాదనల ద్వారా పరిచయం చేసి భారతదేశ గొప్పతనాన్ని విదేశాలలో చాటిన మహనీయులన్నారు. ఆయన వాగ్ధాటికి మంత్ర ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగుపెట్టిన మొట్టమొదటి హిందూ సన్యాసి అయిన వివేకానందుడు చేసిన ప్రసంగాలు భారతదేశంతో పాటు ఇతర దేశాలను సైతం ఉర్రూతలూగించాయని పేర్కొన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి యువతకు దిశా నిర్దేశం



చేశారన్నారు. 39 సంవత్సరాల వయసులోనే వివేకానందుడు పరమపదించటం బాధాకరమన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా జనవరి 12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా గురుదేవ్ విద్యాలయంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఆకుల లిఖిల వివేకానందునిపై చేసిన అనర్గల ప్రసంగం ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా వమవాసీ విద్యార్ధి రవ్వా లక్ష్మణ్ వేసిన వివేకానందుని వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్ బాబు, నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, సాగర్, భాణు, మీసాల శ్రీనివాస్, పెద్దాడ సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానేరు డ్యాం నుండి బోటు సౌకర్యం



చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం నుండి కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామానికి తాత్కాలిక బోటు సౌకర్యాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో ఈనెల 16వ తేదీ నుండి మూడురోజుల పాటు శ్రీభ్రమరాంబ సమేత స్వయంభు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని గంగుల కమలాకర్ తెలిపారు. బ్రహ్మోత్సవాలతో పాటు మహా రుద్ర యాగం జరగనుందని ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి అనేకమంది భక్తులు మైలారం వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారని.. ఐతే కరీంనగర్ నుండి మైలారం రోడ్డు మార్గం ద్వారా వెళ్ళుటకు సుమారు 45 నిమిషాల సమయం పడుతుందని అన్నారు. అదే బోటు ద్వారా ప్రయాణం చేస్తే కేవలం 20 నిమిషాలలో మైలారం చేరుకోవచ్చన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లోయర్ మానేరు డ్యామ్ లో బోట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహా జాతర సందర్భంగా భక్తులకు త్వరగా వెళ్లి రావడానికి అవకాశం కల్పించాలని టూరిజం శాఖకు విజ్ఞప్తి చేయగా బోటులో వెళ్లేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. ఈ బోటు ఈనెల 16 నుండి 18 వరకు మూడు రోజులపాటు నడుస్తుందని తెలిపారు.

ఈనెల 16వ తేదీన గోపూజ గురు వందనం గణపతి పూజ పుణ్యాహవచనం, 17వ తేదీన ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మామిడాల నాగసాయి శర్మ తెలిపారు. 18వ తేదీన మల్లన్న పెద్దపట్నం, కేతకి మేడలమ్మ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంతో పాటు మల్లన్న అగ్నిగుండాల కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ బ్రహ్మోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆ స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసవయి బాలకిషన్, బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ వరాల పరశురాములు, మాజీ సర్పంచ్ జక్కనపల్లి సత్తయ్య, నాయకులు, పలువురు ఆలయ కమిటీ బాధ్యులు.. టూరిజం శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత ఐక్యతకు క్రీడలే మార్గం

- సింగభూపాలెం యూత్ ఆధ్వర్యంలో ఆరు మండలాల యూత్ వాలీబాల్ పోటీలు



చర్చ, సుజాతనగర్:సింగభూపాలెం యూత్ ఆధ్వర్యంలో ఆరు మండలాలకు చెందిన యువతతో ఘనంగా యూత్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో యువ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, సామాజిక స్పృహ పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సాబీర్ పాషా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు, పోటీలు యువతలో పట్టుదల, ఆలోచనాశక్తి, స్వభావంలో సానుకూల మార్పు తీసుకువస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఎంతో అవసరమని, చదువుతో పాటు ఆటలు కూడా సమాన ప్రాధాన్యం కలిగి ఉండాలని సూచించారు.

క్రీడలు మనలో ఐక్యతను పెంపొందిస్తాయని, కులమతాలకు అతీతంగా సామాజిక ఐక్యతను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు కులం లేదని, మతం లేదని, ప్రాంత భేదం లేదనిచేస్తున్నారని తెలిపారు. స్పోర్ట్ అంటేనే స్పిరిట్ ఆఫ్ ఇండియా అని, దేశాన్ని ఐక్యంగా నిలబెట్టే శక్తి క్రీడల్లో ఉందని స్పష్టం చేశారు.భారతదేశం దృఢంగా, శక్తివంతంగా ఎదగాలంటే యువ తరం క్రీడల్లో ముందుండాలని, క్రీడల ద్వారానే దేశానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు వస్తుందని సాబీర్ పాషా అన్నారు. గ్రామీణ స్థాయి నుంచే క్రీడలకు ప్రోత్సాహం లభిస్తే ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అభిప్రాయపడ్డారు.

ఈ వాలీబాల్ పోటీలు యువతలో ఉత్సాహం నింపడమే కాకుండా పరస్పర స్నేహభావం, సమన్వయాన్ని పెంపొందించాయని పాల్గొన్న క్రీడాకారులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సింగభూపాలెం యూత్ సభ్యులు సంకల్పం వ్యక్తం చేశారు.

# ప్రజల అభీష్టం మేరకే అభివృద్ధి పనులకు శ్రీకారం

- వార్డుల అభివృద్ధితోనే గ్రామాభివృద్ధి సాధ్యం
-బూర్గంపాడు గ్రామ సర్పంచ్ మందా నాగరాజు



చర్చ,బూర్గంపాడు:ప్రజల అభీష్టం మేరకే బూర్గంపాడు గ్రామ పంచాయతీలో అభివృద్ధి



పనులకు శ్రీకారం చుడుతున్నట్లు బూర్గంపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. సోమవారం పంచాయతీ పరిధిలోని రామాలయం పరిధిలోని వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ పంచాయితీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్దంగా ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించబడినప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆయన అన్నారు. తద్వారా గ్రామపంచాయతీ అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తామని ఆయన తెలిపారు. ప్రతి వార్డుల్లో ప్రతి సోమవారం నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు పాలకమండలి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఈ పంచాయతీని అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గుండె వెంకన్న, పాలక మండల సభ్యులు రామకృష్ణ, కేసుపాక ప్రవళిక, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ కన్వీనర్ బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన ప్రసాద్ కుమార్, పాషా, పుట్టి లక్ష్మీనారాయణ గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

**సీఎస్ రామకృష్ణారావు**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**


చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశించారు. సీఎస్ రామకృష్ణారావు కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, తగినంత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారో, లేరో పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రి సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ ఎస్ టీ బృందాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లాల వారీగా కలెక్టర్లను పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫొటో ఎలక్టరోల్స్ జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాల వివరాలను సిఎస్ కు జిల్లాల వారీగా కలెక్టర్లు వివరించారు. మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారుల నియమాకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్, డీఈవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖాదీర్ పాషా, అన్వేష్, ఎన్నికల విభాగం అధికారులు ప్రవీణ్, అన్వార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం క్లబ్బులో జిఎల్ఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ ఉపసర్పంచ్‌లకు ఘన సన్మాన సభ



చర్చ,కొత్తగూడెం: కొత్తగూడెం క్లబ్బులో గిరిజన లంబాడి సంఘాల జిఎల్ఎస్ (+నూ) ఆధ్వర్యంలో నంద తండా గ్రామ సర్పంచ్ బలరాం మరియు ఉపసర్పంచ్ మంగమ్మ (ఔ/శీ చిన్నా) లకు ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. గ్రామాభివృద్ధి, గిరిజనుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజాప్రతినిధుల సేవలను గుర్తిస్తూ జిఎల్ఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బలరాం, ఉపసర్పంచ్ మంగమ్మలను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గిరిజన తండాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్య, రహదారులు, తాగునీరు, సంక్షేమ పథకాల అమలులో సర్పంచ్--ఉపసర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు, అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు. సభ మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## మున్సిపల్ ఓటర్ జాబితాను విడుదల చేసిన కమిషనర్



చర్చ:- హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులకు గాను ఓటర్ తుది జాబితాను మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ఫోటోలతో కూడిన ఓటర్ జాబితాను విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్లు 19227 గా ఉన్నట్లు వీటిలో 9348 మంది పురుషులు, 9873 మంది స్త్రీలు, ఇతరులు ఆరుగురు ఉన్నట్లు ఆయన తెలిపారు. 20 వార్డులకు గాను 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి ఓటర్ జాబితా ఇదే ఫైనల్ అని ఆయన అన్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలు అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మున్సిపల్ కమిషనర్ సతీమణి ప్రసవం..

- పండంటి పాపకు జన్మనిచ్చిన తల్లి..
- అనుభవజ్ఞులైన గైనకాలజిస్టులు, వైద్య సిబ్బంది నేతృత్వంలో డెలివరీ విజయవంతం..
- ప్రభుత్వ వైద్యంపై పెరుగుతున్న నమ్మకం..
- ఆదర్శంగా నిలిచిన
- కరీంనగర్ కమిషనర్ దంపతులు..
- జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారుల అభినందనలు..



చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వా సుపత్రులపై నమ్మకం రోజురోజుకు పెరుగుతున్నది. ఐఏఎస్ అధికారులు వారి కుటుంబ సభ్యులు, సాధారణ ప్రజలు అత్యుత్తమ సేవలను ప్రభుత్వాసుపత్రిలో పొందుతున్నారు. ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో సేవలందించడంతో రోజురోజుకు ప్రభుత్వ ఆస్పత్రి సేవలపై పాజిటివ్ దృక్పథం పెరిగిపోతున్నది. ప్రైవేట్ ఆస్పత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రులకే ప్రాధాన్య మిస్తున్నారు. ఇందుకు విశేషం ఏమిటంటే కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ఐఏఎస్ అధికారి ప్రఫుల్ దేశాయ్ సతీమణి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మాత శిశు కేంద్రంలో పండంటి పాపకు జన్మనిచ్చింది. మున్సిపల్ కమిషనర్ దంపతులు ఆదర్శంగా నిలిచారు. వారిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వైద్యాధికారులు సిబ్బంది అభినందించారు. గర్భవతి అయిన మున్సిపల్ కమిషనర్ సతీమణినీ కమిషనర్ ప్రఫుల దేశాయ్ ఆదివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేయించారు. ఉమ్మనీరు తగ్గడంతో ప్రభుత్వ ప్రధానాస్పత్రి మాత శిశు కేంద్రంలో చేర్పించారు. సోమవారం గైనకాలజిస్టుల పర్యవేక్షణలో ఆమెకు ఆపరేషన్ చేశారు. అనుభవజ్ఞులైన గైనకాలజిస్టు నిపుణులైన వైద్య బృందం నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో డెలివరీని విజయవంతంగా నిర్వహించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సతీమణి పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు. ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. హెచ్ ఓ డి గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ గైనకాలజిస్టులు డాక్టర్ దీప సంగీత సుహాసిని పిల్లల వైద్య నిపుణులు వేణు మల్లికార్జున్ అనస్థీసియా హెచ్ ఓ డి డాక్టర్ శంతన్, సంగీత నర్సింగ్ సూపరింటెండెంట్ సరిత పద్మశ్రీ రమ వైద్య సేవలు అందించారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి మాత్రం గర్భవతి అయిన తన సతీమణినీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం విశేషం. ఈ పరిణామం తెలంగాణ ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లోనే కాకుండా, ఉన్నతాధికారుల్లోనూ విశ్వాసం పెరుగుతోంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలోపేతానికి ఇది మరో సానుకూల సంకేతంగా నిలుస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో పై ఉన్న అపోహలు తొలగి సామాన్య ప్రజలు మరింత ధైర్యంగా వైద్య సేవలను వినియోగించుకునే అవకాశం ఉందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ దంపతులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి ఆర్ఎంఓ నవీనా వైద్య అధికారులు తదితరులు అభినందనలు తెలిపారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలు పంపిణీ

**- పాల్గొన్న సింగరేణి, సీఎంపిఎఫ్ అధికారులు, యూనియన్ ప్రతినిధులు**

**- కృతజ్ఞతలు తెలియజేసిన ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ క్రిస్టఫర్ లు**



చర్చ, సింగరేణి కార్పొరేట్: కొత్తగూడెం సింగరేణి కార్పొరేట్ పరిధిలో సివిల్ డిపార్టుమెంట్ ద్వారా వివిధ కాంట్రాక్టర్స్ క్రింద పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 2023-24 సంవత్సరానికి గాను అప్డేట్ అయినా సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలను సోమవారం నాడు సింగరేణి కార్పోరేట్ సివిల్ డీజీఎం కార్యాలయం వద్ద పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి సివిల్ జనరల్ మేనేజర్ డి వెంకటేశ్వరావు, వెల్ఫేర్ జీఎం శ్రీజీవి కిరణ్, సిఎంపిఎఫ్ కమిషనర్స్ శ్రీ కిషోర్, శ్రీమతి కనకమ్మ , శ్రీ చిరంజీవి, కార్పొరేట్ సివిల్ ఎస్ ఈ శ్రీ పి రాజేంద్ర ప్రసాద్, పర్సనల్ డిపార్ట్మెంట్ డీజీఎం శ్రీ వరప్రసాద్, ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు పీతాంబరం మరియు సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది, సీఎం పిఎఫ్ అధికారులు, సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టు సూపర్వైజర్స్, కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీఎంపీఎఫ్ భవిష్య నిధి కాంట్రాక్ట్ కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా, భవిష్యత్తు అవసరాలకు ఉంటుందని తెలిపారు. రాబోయే కాలంలో ఆన్లైన్ ద్వారా సీఎంపిఎఫ్ వివరాలు తెలుసుకునే అవకాశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా తెలియజేశారు. సీఎంపిఎఫ్ పాస్ పుస్తకాలను పంపిణీ చేసి నందుకు సివిల్ అధికారులకు, సీఎంపీఎఫ్ అధికారులకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ - ఏఐటీయూసీ తరఫున కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కిష్టాఫర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జనసేన పార్టీ ఉమ్మడి అదిలాబాద్ సమన్వయకర్తగా మంథని సంపత్ కుమార్..



చర్చ,మంచిర్యాల: తెలంగాణ గడ్డపై జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో పునర్ నిర్మించే దిశగా ఆ పార్టీ అధినేత ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. త్వరలో కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు .ఈ నేపథ్యంలో తెలంగాణ లో ఉమ్మడి జిల్లాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్తగా మంథని సంపత్ కుమార్ ను నియమిస్తూ పార్టీ ఉపాధ్యక్షులు బి మహేందర్ రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ అదిలాబాద్ తూర్పు జిల్లా బాధ్యులుగా పని చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన నేపథ్యంలో జనసేన పార్టీలో చేరారు .గతంలో ప్రజారాజ్యం పార్టీలో వారి సేవలను గుర్తిస్తూ తిరిగి జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్తగా నియమించారు. కాగా తన నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ , ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి ,ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి కి సంపత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సంపత్ కుమార్ పేర్కొన్నారు.

## వెలిచాలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు

**- ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసి ఆశీస్సులు అందుకున్న వెలిచాల రాజేందర్ రావు**



చర్చ, కరీంనగర్ ప్రతినిధి:- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వెలిచాల రాజేందర్ రావు సోమవారం సాయంత్రం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును శాలువాతో సన్మానించారు. మంత్రి ఆశీస్సులు అందుకున్నారు. మంత్రి శ్రీధర్ బాబు రాజేంద్ర రావుకు అభినందనలు తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి తీరాలని, అందుకు అహర్నిశలు పాటుపడాలని రాజేందర్రావుకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కరీంనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి వెలిచాలకు సూచించారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీల కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని సలహా ఇచ్చారు.

## సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ




చర్చ,సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అక్కపాక సురేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ సుల్తానా బాద్ పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, ఎంఈఓ రాజయ్య,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమీర్ శెట్టి తిరుపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమతా కృష్ణ ,పాల్గొని క్రీడాజ్యోతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం కప్ క్రీడా పోటీలు గ్రామీణ, పట్టణ స్థాయిలోని క్రీడాకారులకు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందించుకోవాలని సూచించారు. సీఎం కప్ ద్వారా దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో సీనియర్ క్రీడాకారులు గుణపతి, అమీర్ శెట్టి రాజలింగం, అబ్బయ్య గౌడ్, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్,పేట కార్యదర్శి దాసరి రమేష్, గెల్లు మధుకర్, ఆలేటి సంపత్, వెంకటేష్, ప్రణయ్, సత్యం, శివ, ఎల్లె రాజు అజ్జుతో పాటు పలువురు క్రీడాకారులు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైరా ఆర్‌టీఓ ఆఫీస్ తరలింపుపై అఖిలపక్షం గర్జన సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం



చర్చ:వైరా : వైరా నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఓ) కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను నిరసిస్తూ అఖిలపక్ష పార్టీలు ఐక్యపోరాటానికి సిద్ధమయ్యాయి. ఈ అంశంపై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించేందుకు సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక సీపీఎం కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. పోరుకు సిద్ధమైన పార్టీలువైరా ప్రజలకు, వాహనదారులకు ఎంతో కాలంగా సేవలందిస్తున్న ఆర్‌టీఓ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించడం వల్ల స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అఖిలపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు

# ఆయుధాలాంటి అక్షరాలను అందించిన అలిశెట్టి ప్రభాకర్




చర్చ:- హుస్నాబాద్: పేదోడి ఆకలి పేగుల్ని పల్లెలోని ప్రజల దుఃఖాన్ని నగరంలో నలిగిపోతున్న జీవితాన్ని నాలుక దాటుని నగ్న సత్యాన్ని ఆకలి కడుపుని తోడుకున్న అస్తిపంజరాల్ని యువత తమరు నింపుకోవలసిన ఆవేశాన్ని ఆలోచనని ఈ దోపిడి వ్యవస్థపై ఎక్కు పెట్టకుండా ముడుచుకున్న పిడికిలిని సమాజంతో మాకేంటి అని బ్రతికే పిరికోళ్ళని సమానంగా బ్రతకనివ్వని కులపిశాచుల్ని ఇలాంటి ఎన్నో అంశాలను అనుచబడ్డ బతుకులను అరిచి చెప్పిన వ్యక్తి అలిశెట్టి తన జీవితం 39 ఏళ్లకే ముగిసిపోయింది కానీ అతని కవిత్వం మాత్రం జనం గుండెల్లో ఇప్పటికీ ఎగిసిపడుతూనే ఉంది

దివంగత కవి అలిశెట్టి ప్రభాకర్ 72 జయంతి,33వ వర్ధంతిని పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రంథలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలను తన కలం ద్వారా ప్రపంచానికి తెలియజేసిన మహాకవి అలిశెట్టి ప్రభాకర్ అని అన్నారు. చిత్రకారుడిగా, ఫోటోగ్రాఫర్ గా వివిధ వృత్తులలో రాణించారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, ఓయూ జెఎసి వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, పద్మశాలి కుల బాంధవులు గాజుల భగవాన్, వడ్డేపల్లి వెంకటరమణ, చింతకింది శ్రీనివాస్, కొండ సతీష్, వెల్దండి లక్ష్మీపతి, వడ్డేపల్లి లక్ష్మణ్, కొండి గణపతి, కోమిటీ నారాయణ, బొడ్డు రాజ్ కుమార్, సాధుల యాదగిరి, వేముల రాజేశం,కొండ చంద్రయ్య, కోడం ప్రభాకర్, కనుకుంట్ల శ్రీనివాస్,నోముల బాలయ్య, సతీష్, నాయకులు పూదరి శ్రీనివాస్,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షురాలిగా తోట దేవి ప్రసన్న ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిధులుగా పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎంపీ రామ సహాయం
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఎఫ్.డిసి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య



చర్చ,కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా తోట దేవిప్రసన్న ప్రమాణ స్వీకార కార్యక్రమం పట్టణంలో ఘనంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సభకు ముఖ్య అతిధులుగా హాజరైన రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామ సహాయం రఘు రాంరెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, సమక్షంలో తోట దేవిప్రసన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా దేవి ప్రసన్న నియామకం కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే స్థానిక ఎన్నికల్లో ప్రజలు పార్టీకి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, పదవులు కల్పిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ లో కొత్త, పాత తేడా లేదని అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. భద్రాద్రి జిల్లాకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరావు తో పాటుగా తాను ఉన్నానని, తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్న ఆయన పార్టీని నమ్ముకుని కష్టాల్లో ఉన్నపటికీ కన్నీరు పెట్టుకుంటూ జెండాని వదలకుండా పోరాటం చేసిన కాంగ్రెస్ కార్యకర్తకి అండగా ఉంటానని, మీ ఇంటి పెద్దకొడుకుగా మీ తమ్ముడుగా అండదండలుగా ఉంటానన్నారు. ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రేమను మరింత పెంచుదామని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేద్దామని స్థానిక సంస్థ ఎన్నికలు గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజల దీవెనలతో మంచి ఫలితాలు వచ్చాయని భవిష్యత్తులో రానున్న కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలు రానున్నాయన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో చాలా విశాలమైన కార్పొరేషన్ గా ఏర్పడిందని కొత్తగూడెం కార్పొరేషన్ మీద మూడు రంగుల మువ్వన్నెల జెండాని ఎగరవేసే బాధ్యత నాయకులతో పాటు కార్యకర్తలదని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న మాట్లాడుతు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, ఎంపీలు రామసహాయం రఘు రాంరెడ్డి, పోరిక బలరాం, సహకారంతో భద్రాద్రి జిల్లాను తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పనిచేస్తానన్నారు. పీసీసీ జనరల్ సెక్రటరీ మోత్కురి ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, ఉపాధ్యక్షులు గడ్డం రాజశేఖర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, ఓబీసీ చైర్మన్ అల్లాడి నర్సింహారావు, మైనారిటీ సెల్ చైర్మన్ మహబూబ్ ఖాన్, ఎస్టీ సెల్ రవి, మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, గడిపల్లి కవిత, చీూఖ× అధ్యక్షులు అజ్మీరా సురేష్ నాయక్, ఎస్సి సెల్ కన్వీనర్ జెబి శౌరి, జిల్లా మహిళ కాంగ్రెస్ కార్యదర్శి పొదిలి జ్యోతి, సుజాతనగర్ మండలాధ్యక్షులు చింతలపూడి రాజ శేఖర్, సోషల్ మీడియా వీరాపురం లక్ష్మణ్, నాయకులు కోనేరు చిన్ని, విజయబాయి, జెవిఎస్ చౌదరి, వీరబాబు, సోమిరెడ్డి, వివిఎన్ కొండా స్వామి, తాజా మాజీ సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, జిల్లా నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, మండల-పట్టణ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ఈయూఐ, ఐఎన్టీయూసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు సాక్షిగా రేవంత్ ద్రోహ బుద్ధి బయటపడింది



హైదరాబాద్, జనవరి 12: నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. దీనిపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లమల సాగర్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తున్న రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని వ్యాఖ్యలు చేశారు. విచారణ అర్హత లేని పిటిషన్ వేసి ఏపీ ప్రభుత్వం అక్రమంగా పోలవరం నిర్మిస్తోందని మండిపడ్డారు. నాడు పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలోనూ రైతులతో ఏపీ ప్రభుత్వం రిట్ వేయించిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని మాజీ మంత్రి ఆరోపించారు. అది ముగియని కథే.'ఈ మాత్రం విషయం మీ న్యాయవాది, మీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి తెలియదా?. ఈ మాత్రం దానికి నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా వెళ్లాలా?' అంటూ ఎద్దేవా హరీష్ చేశారు. ముఖ్యమంత్రిగా ఉంటూ తెలంగాణ నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేస్తూ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. రిట్ ఉపసంహరించుకొని, సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం- నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమే అని హరీష్‌రావు విమర్శించారు. ఏపీ, తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథే అని మాజీ మంత్రి అన్నారు. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకొని, తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ అప్పనంగా నీళ్లను తరలించుకుపోతుందని మండిపడ్డారు. సంక్రాంతి పండుగ వేళ చంద్రబాబుకు రేవంత్ ఇచ్చిన గిఫ్ట్.. సుప్రీంకోర్టులో వేసిన ఈ బలహీనమైన రిట్ అంటూ మాజీ మంత్రి హరీష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోను.. పెట్టను అంటూనే ద్రోహం. పోలవరం-నల్లమల సాగర్ విషయంలో ముందు నుంచీ రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి పూర్తిగా సహకరిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లారని.. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపారన్నారు. పెట్టబోను అంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాశారంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. వేయను అంటూనే కమిటీ వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశారని ఆరోపణలు చేశారు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్లి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపారని మండిపడ్డారు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్‌కు మద్దతు ప్రకటించారంటూ సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. రేవంత్ మాటల ఆంతర్యమేంటి? తాము నిలదీస్తే బనకచర్లను అడ్డుకుంటామని, సుప్రీంకోర్టుకు వెళ్తామని నమ్మబలికిన రేవంత్ రెడ్డి, నేడు కావాలనే బలహీనమైన పిటిషన్ వేసి తెలంగాణకు మోసం చేశారని ఆరోపణలు చేశారు. పంచాయతీలు వద్దు, న్యాయస్థానాలు వద్దు కూర్చొని చర్చించుకుందామన్న రేవంత్ రెడ్డి మాటల అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పచెప్పడమేనా చర్చల లక్ష్యమని నిలదీశారు. తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నిస్తూ.. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని హరీష్ రావు హెచ్చరించారు. 'రేవంత్ రెడ్డి.. నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరు చేస్తాం' అంటూ మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రూ.5కోట్ల ఆస్తులు సీజ్



వరంగల్, జనవరి 12: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన రూ.5కోట్ల విలువైన ఆస్తులను ఐటీ (ఆదాయపు పన్ను) అధికారులు అటాచ్ చేశారు. బినామీ యాక్ట్ కింద సిద్దిపేట, జనగామలో ఆయనకు చెందిన పలు విలువైన ఆస్తులను అటాచ్ చేస్తూ ఐటీ అధికారులు సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తన కుమార్తె తుల్జా భవానీ రెడ్డి పేరు మీద జనగామ, సిద్దిపేటలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పలు భూములు కొనుగోలు చేశారు. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఐటీ అధికారులు రంగంలోకి దిగి.. ఆ దిశగా విచారణ చేపట్టారు. తన కుమార్తెను బినామీగా పెట్టి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులకు పలు ఆధారాలు లభ్యమయ్యాయి. ఆ క్రమంలో ఈ భూముల కొనుగోలుపై యాదగిరిరెడ్డి కుమార్తె తుల్జా భవానీరెడ్డిని విచారించారు. ఈ భూములు కొనుగోలు చేసేందుకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందంటూ తుల్జా భవానీ రెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చిందో తనకు తెలియదని ఐటీ అధికారులకు ఆమె వెల్లడించింది. తన తండ్రి సంతకం పెట్టమని చెబితేనే.. తాను ఈ భూములకు చెందిన సేల్ డీడ్‌పై సంతకం చేశానంటూ ఐటీ అధికారులకు తుల్జా భవానీ దేవి వివరించారు. ఆమె చెప్పిన స్టేట్‌మెంట్‌ను ఐటీ శాఖ ఉన్నతాధికారులు రికార్డు చేశారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా సిద్దిపేట, జనగామలో రూ.5కోట్లు విలువైన ఆస్తులను ఐటీ శాఖ అధికారులు ఫ్రీజ్ చేశారు.

# దేశంలోనే రోల్ మోడల్, గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్




హైదరాబాద్, జనవరి 12: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉపముఖ్యమంత్రి మరోసారి తన నిబద్ధతను వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు భట్టి. స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనన్నారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ ఆదేశాల ద్వారా ప్రాజెక్ట్ అమలులో వేగం, జవాబుదారీతనం, పారదర్శకత ఉండేలా చూస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కాగా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తెలంగాణ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమానత్వం, సమగ్ర విద్యా అవకాశాలు అందరికీ అందుబాటులోకి రావాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

# పెరుగుతున్న నిర్బంధం - మారిన దోపిడీ తీరు

- పురోగమనంలో కమ్యూనిస్టులు
- చారిత్రిక మలుపుగా ఖమ్మం సభ మీడియా సమావేశంలో కూనంనేని




చర్చ,ఖమ్మం: బిజెపి పాలనలో నిర్బంధం పెరుగుతుందని బూటకపు ఎన్ కౌంటర్ల పేరుతో ఒక పక్క హతమారుస్తూ మరో పక్క ప్రశ్నించే వారిని అర్బన్ నక్సల్స్ పేరుతో నిర్బంధాలకు గురి చేస్తున్నారని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని బిజెపి భావిస్తుందని కూనంనేని తెలిపారు. ఖమ్మంలో జనవరి 18న జరగబోయే సభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఓ మైలురాయిగా నిలవనుందని ప్రజా ఉద్యమాలకు కీలక మలుపు కానుందని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ,వందేళ్ల పోరాట చరిత్ర ఏ పార్టీకి లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారన్నారు. దేశంలో రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థి, యువజనులు,ఉద్యోగులు, ఇప్పటి సాఫ్ట్వేర్లు సహా ఎవరికి అన్యాయం జరిగినా వారి పక్షాన ఆలోచించేది. ఆందోళన చేపట్టేది కమ్యూనిస్టులేనన్నారు. దోపిడీ,పీడన వివక్షలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. ఇప్పుడు దోపిడీ తీరు మారిందని ఒకప్పుడు బ్లాక్ కాలర్ నేరాలు ఉంటే ఇప్పుడు వైట్ కాలర్ నేరాలు పెరిగిపోయాయని మనిషిని మనిషిగా నిలబెట్టి సర్వం దోచుకోవడం జరుగుతుందన్నారు. నవీన దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని కూనంనేని స్పష్టం చేశారు.

# మన శంకర వరప్రసాద్ సినిమా థియేటర్‌లో తీవ్ర విషాదం

హైదరాబాద్, జనవరి 12 : హైదరాబాద్ కూకట్‌పల్లి పరిధిలోని అర్జున్ థియేటర్లో విషాద ఘటన చోటుచేసుకుంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ సినిమా ( తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన విషయం తెలసిందే. ఈ క్రమంలోనే తన అభిమాన నటుడు చిరంజీవి చిత్రం కావడంతో ఆనంద్ కుమార్ అనే వ్యక్తి అర్జున్ థియేటర్లో టికెట్ బుక్ చేసుకున్నాడు. ఈ సినిమా చూస్తూ ఆనందిస్తున్న సమయంలో ఆనంద్ కుమార్ అకస్మాత్తుగా మృతిచెందడం కలకలం రేపింది. ఈ ఘటనతో థియేటర్‌లో విషాద వాతావరణం నెలకొంది. సినిమా చూస్తుండగా. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సినిమా చూస్తున్న సమయంలో ఆనంద్ కుమార్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుర్చీలోనే కుప్పకూలిపోయిన అతన్ని గమనించిన ప్రేక్షకులు థియేటర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు అనుమానించారు. రిటైర్డ్ ఏఎస్ఐగా గుర్తింపుమృతుడు ఆనంద్ కుమార్ గతంలో 12వ బెటాలియన్‌లో ఏఎస్ఐగా పనిచేసి రిటైరైనట్లు తెలుస్తోంది. సినిమా చూడటానికి థియేటర్‌కు వచ్చిన ఆయనకు ఇలాంటి సంఘటన జరగడం కుటుంబ సభ్యులు, స్నేహితులను తీవ్ర విషాదంలో ముంచింది. గుండెపోటే కారణమా..ఆనంద్ కుమార్ గుండెపోటుతో మృతిచెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే ఖచ్చితమైన కారణం వైద్యుల నివేదిక వచ్చిన తర్వాతే తెలుస్తుందని పోలీసులు స్పష్టం చేశారు. మృతదేహం తరలింపుసమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. థియేటర్‌లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద మృతి కేసు నమోదుఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆనంద్ కుమార్ కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. పోస్ట్‌మార్టం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# భారీగా చైనీస్ మాంజా సీజ్ 57 మంది అరెస్ట్

హైదరాబాద్: దేశంలో చైనా మాంజాపై నిషేధం విధించినప్పటికీ.. వీటి అమ్మకాలు ఇంకా జరుగుతునే ఉన్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పతంగులు ఎగురవేస్తూ ఆనందిస్తున్న సమయంలో ఈ చైనా మాంజా ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే ఈ చైనీస్ మాంజా కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ వ్యాప్తంగా చైనీస్ మాంజా నిషేధానికి పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. జనవరి 8 నుంచి 11 వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు రూ.43 లక్షల విలువైన 2,150 బాబిన్లు సీజ్ చేసి.. 57 మందిని అరెస్ట్ చేశారు. నిషేధిత మాంజా విక్రయంపై 29 కేసులు నమోదు చేశారు. గత 30 రోజులలో 132 కేసులు నమోదు చేసి, రూ.1.68 కోట్ల విలువైన 8,376 బాబిన్ల చైనీస్ మాంజా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో 200 మందిని అరెస్ట్ చేశారు పోలీసులు. కాగా.. చైనా మాంజా అంటే నైలాన్ లేదా సింథటిక్ దారానికి గాజు, లోహపు పొడుల వంటి పదునైన పదార్థాలను పూతగా వేసి తయారుచేసే ప్రమాదకరమైన దారం. ఇది సంప్రదాయ పత్తి దారంతో రూపొందించిన మాంజా కంటే చాలా పదునుగా బలంగా ఉంటుంది. అయితే.. ఇది పర్యావరణానికి హానికరం. మనుషులకు, పక్షులకు, జంతువులకు గాయాలు చేసి, కొన్నిసార్లు ప్రాణాపాయం కూడా కలిగిస్తోంది. అందుకే చైనీస్ మాంజా విక్రయాలపై నిషేధం విధించారు. ఈ సంక్రాంతి పండుగ వేళ వీటి విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు.

# కృష్ణా, గోదావరి జలాలు ఆంధ్రాకు తాకట్టు : మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రాకు తాకట్టు పెడుతున్నదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ నాయకులు కేవలం పదవుల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసమే కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రాకు తాకట్టు పెడుతున్నరని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం-నల్లమల సాగర్‌పై తెలంగాణ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని, ఆ బలహీనమైన పిటిషన్ చెల్లదని సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని జగదీష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కనుసన్నల్లో ఈ దుర్మార్గం అంతా జరుగుతున్నదని తెలిపారు. హంగు ఆర్భాటంతో సుప్రీంకోర్టుకు వెళ్లిన తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. బయటకు వచ్చిన తర్వాత మొహం చూపించకుండా వెళ్ళిపోయాడని అన్నారు. సుప్రీంకోర్టులో విచారణ అర్హత లేని పిటిషన్ వేసినప్పుడే వీళ్లకు తెలంగాణ ప్రయోజనాలపట్ల సోయి లేదనే విషయం తేలిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు వాటాల పంచాయతీ, ఢిల్లీకి మూటలు పంపించడమే సరిపోతుందని అన్నారు. రాష్ట్ర సర్కారులోని ఏ శాఖలో ఏం జరుగుతుందో మంత్రులకే తెలియడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం దొంగల చేతిలో ఉన్నదని వ్యాఖ్యానించారు.

# బ్యాటింగ్ శైలిని పూర్తిగా మార్చేసుకున్న కోహ్లీ



క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ ఒక రన్ మెషీన్. గత దశాబ్ద కాలంగా అతను క్రీజులో ఉన్నాడంటే స్కోరు బోర్డు పరుగులెడుతుందని ఫ్యాన్స్‌కు నమ్మకం. అయితే నిన్నటి వరకు మనం చూసిన కోహ్లీ వేరు, ఇప్పుడు చూస్తున్న కోహ్లీ వేరు. సాధారణంగా విరాట్ క్రీజులోకి రాగానే కొంచెం సమయం తీసుకుని, సెటిల్ అయ్యాక గేర్ మారుస్తుంటాడు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఆడిన తీరు చూస్తే, కోహ్లీ తన బ్యాటింగ్ ఫిలాసఫీని పూర్తిగా మార్చేసుకున్నాడని అర్థమవుతోంది. వడోదరలో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఫస్ట్ మూడు బంతుల్లోనే బౌండరీ బాదేశాడు. రాయ్‌పూర్, రాంచీ మ్యాచ్‌ల్లో కూడా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. బౌలర్ ఎవరైనా సరే, క్రీజులోకి రాగానే తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని కోహ్లీ ప్రయత్నిస్తున్నాడు. గతంలో ఇన్నింగ్స్‌ను హోల్డ్ చేసే యాంకర్ రోల్ పోషించిన విరాట్ ఇప్పుడు మాత్రం ఎదురుదాడితో బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. అనవసరంగా వెయిట్ చేయకుండా మన స్ట్రెంగ్త్ మీద నమ్మకంతో కౌంటర్ ఎటాక్ చేయాలి అని కోహ్లీ స్వయంగా తన కొత్త ఫార్ములాను బయటపెట్టాడు.విరాట్ కోహ్లీ ఇప్పుడు ఏ రికార్డు కోసమో లేక తనని తాను నిరూపించుకోవడానికో ఆడటం లేదు. అన్నీ సాధించాక వచ్చే ఒక రకమైన స్వేచ్ఛ అతని బ్యాటింగ్ లో కనిపిస్తోంది. టెస్ట్, టీ20 రిటైర్మెంట్ తర్వాత వన్డేలలో మళ్ళీ స్ట్రాంగ్ రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ, తనలోని పాత ప్యాషన్‌ను వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. అక్టోబర్ నుంచి ఆడిన ఏడు మ్యాచుల్లో విరాట్ 106 స్ట్రైక్ రేట్‌తో 469 పరుగులు చేశాడు. ఇది అతని కెరీర్ యావరేజ్ స్ట్రైక్ రేట్ (93.7) కంటే చాలా ఎక్కువ. రికార్డుల భారం దింపేసి ఆడుతుండటం వల్లే ఈ అద్భుతమైన ఫామ్ సాధ్యమవుతోంది.కోహ్లీ ప్రస్తుత బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే కెప్టెన్ రోహిత్ శర్మ పద్ధతి గుర్తొస్తుంది. 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్‌లలో రోహిత్ కూడా ఇదే తరహా అగ్రెసివ్ మైండ్ సెట్‌తో ఆడి సక్సెస్ అయ్యాడు. వ్యక్తిగత రికార్డుల కంటే టీమ్‌కి మంచి ఆరంభం ఇవ్వడమే లక్ష్యంగా రోహిత్ బ్యాట్ ఝులిపించాడు. ఇప్పుడు విరాట్ కూడా అదే బాటలో నడుస్తున్నాడు. నెంబర్ 3 లో బ్యాటింగ్‌కి వచ్చే కోహ్లీ, బౌలర్లు సెటిల్ అవ్వకముందే వారి లయను దెబ్బతీస్తూ టీమ్ ఇండియాను సేఫ్ జోన్‌లో కూర్చోబెడుతున్నాడు.విరాట్‌లో వచ్చిన ఈ మార్పు కేవలం బ్యాటింగ్‌లోనే కాదు, తన ఆలోచనా విధానంలో కూడా కనిపిస్తోంది. "నేను ఇప్పుడు మైలురాళ్ల గురించి ఆలోచించడం లేదు, టీమ్‌ని కంఫర్టబుల్ పొజిషన్‌లో ఉంచడమే నా గోలు అని అతను ఓ క్లారిటీ ఇచ్చేశాడు. టెక్నిక్‌లో మార్పులు కంటే మెంటల్‌గా అతను ఎంత స్ట్రాంగ్‌గా ఉన్నాడనేది అర్థమవుతుంది. మెల్లగా ఆడుతూ వికెట్ ఇచ్చుకునే కంటే, తన బలాన్ని నమ్ముకుని అటాక్ చేయడం మంచిదని అతను భావిస్తున్నాడు. ఈ క్లారిటీయే అతన్ని క్రికెట్‌లో మళ్లీ తిరుగులేని వీరుడిగా మారుస్తోంది. వడోదర, రాయ్‌పూర్‌లలో కోహ్లీ కొట్టిన బౌండరీలు కేవలం రన్స్ మాత్రమే కాదు, ప్రత్యర్థులకు అతను ఇస్తున్న హెచ్చరికలు. తన ఆటను మార్చుకుంటూ మోడరన్ క్రికెట్ డిమాండ్స్‌కి తగ్గట్టుగా అతను అప్డేట్ అవుతున్నాడు. వయసు పెరుగుతున్నా తన ఫిట్‌నెస్, ఆకలి ఏమాత్రం తగ్గలేదని విరాట్ నిరూపిస్తున్నాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా ఇంతటి ఎనర్జీతో, భయం లేకుండా ఆడటం నిజంగా గ్రేట్ అని చెప్పాలి. కింగ్ కోహ్లీ ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలను అందుకోవడం ఖాయం.

# వైభవ్ సూర్యవంశీ దెబ్బకు కోహ్లీ, గిల్ రికార్డులు బద్దలు



భారత క్రికెట్‌లో మరో అద్భుతమైన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దిగ్గజాల దృష్టిని ఆకర్షిస్తున్నాడు బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ. ప్రస్తుతం జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లలో పరుగుల వరద పారిస్తున్న ఈ యువ ఆటగాడు, త్వరలో జరగనున్న యూ19 వరల్డ్ కప్ 2026లో టీమిండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ పేరిట ఉన్న భారీ రికార్డులను తుడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాడు. యూత్ వన్డే కెరీర్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో వైభవ్ వేగంగా దూసుకుపోతున్నాడు. ఇప్పటివరకు ఆడిన 18 మ్యాచ్‌ల్లోనే 973 పరుగులు సాధించాడు. టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో మొత్తం 978 పరుగులు చేశాడు. అంటే, వైభవ్ మరో 6 పరుగులు చేస్తే చాలు, కోహ్లీ రికార్డును అధిగమించి ముందుకు వెళ్తాడు. కేవలం కోహ్లీ మాత్రమే కాదు, ప్రస్తుత టీమిండియా స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ రికార్డు కూడా వైభవ్ టార్గెట్‌లో ఉంది. గిల్ తన యూ19 వన్డే కెరీర్‌లో 1149 పరుగులు చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే, రాబోయే అండర్-19 ప్రపంచ కప్‌లోనే ఈ మార్కును సులువుగా దాటే అవకాశం కనిపిస్తోంది.కేవలం 13 ఏళ్ల వయసులోనే యూత్ వన్డేల్లో సెంచరీ చేసిన రికార్డు వైభవ్ సొంతం.సిక్సర్ల కింగ్: యూత్ వన్డేల్లో అత్యధికంగా 80కి పైగా సిక్సర్లు బాదిన రికార్డు కూడా ఈ చిన్నారి ఆటగాడి ఖాతాలోనే ఉంది.రాబోయే యూ19 వరల్డ్ కప్‌లో వైభవ్ సూర్యవంశీ ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. తన పవర్ హిట్టింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు నిద్రలేకుండా చేస్తున్న ఈ 'వండర్ కిడ్ల భవిష్యత్తులో భారత సీనియర్ జట్టులో కూడా సంచలనం సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.


# ఆయుష్ బదోనికి పిలుపు!

న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆడుతున్న భారత్ జట్టులో మార్పులు చేర్పులు జరిగాయి. బౌలింగ్ చేస్తున్నప్పుడు గాయపడ్డ వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆయుష్ బదోనీకి పిలుపునిచ్చారు. వన్డే సిరీస్‌లో భాగంగా వడోదరలో ఆదివారం జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని స్థానంలో ఆయుష్ బదోనిని ప్రకటించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. దీంతో ఆ రెండు మ్యాచ్‌లకు వాషింగ్టన్ స్థానంలో బదోని ఆడనున్నాడు. నవరి 14, 18 తేదీల్లో భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో, మూడో వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి. , వాషింగ్టన్ సుందర్ స్థానంలో భారత జట్టులో ఇప్పుడు బదోని చేరాడు. ఆయుష్ బదోని ఎవరు, అతను మొదటిసారిగా టీమ్ ఇండియా జట్టులోకి ఎందుకు ఎంపిక చేశారు. అలాంటి ఫెర్ఫార్మెనన్స్ యన ఏం చేశాడో ఇక్కడ తెలుసుకోండి. ఆయుష్ బదోని డిసెంబర్ 3, 1999న ఢిల్లీలో జన్మించాడు, అయితే అతను వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందినవాడు. అతని కుటుంబం దేవప్రయాగ్ బ్లాక్‌లోని చిన్న గ్రామం సిలోడ్‌కు చెందినది. వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందిన అతని కుటుంబం తరువాత ఢిల్లీకి షిఫ్ట్ అయ్యింది, దీని కారణంగా ఆయుష్ తన బాల్యాన్ని ఢిల్లీలోనే గడిపాడు. ఆయుష్ బదోనికి చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. 9 సంవత్సరాల వయస్సులోనే క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొని ప్రాక్టీస్ ప్రారంభించాడు. కుమారుడి టాలెంట్ గుర్తించిన తండ్రి బదానిని సోనెట్ క్రికెట్ అకాడమీలో కోచింగ్ కోసం జాయిన్ చేశాడు. అప్పటి వరకు తండ్రి వద్దే శిక్షణ తీసుకున్నాడు. అంటే వాస్తవానికి అతని మొదటి కోచ్ అతని తండ్రి వివేక్ బదోని అయ్యారన్నమాట. వివేక్ తన కొడుకులో క్రికెట్ పట్ల ఉన్న మక్కువను చూసి బంతి, బ్యాట్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించడం ప్రారంభించాడు. వివేక్ బదోని వృత్తిరీత్యా డాక్యుమెంటరీ సినిమాలు తీస్తారు. ఆయుష్ తల్లి, విభ బదోని వృత్తిరీత్యా స్కూల్ టీచర్. బదాని ఆసక్తిని గమనించిన తండ్రి వివేక్ ఇంటి పైకప్పును నెట్ ప్రాక్టీస్ ఏరియాగా మార్చారు. ఆయుష్ ఇక్కడే నెట్ ప్రాక్టీస్ చేసేవాడు. 26 ఏళ్ల ఆయుష్ బదోని దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరపున ఆడాడు. ఐపీఎల్లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అరంగేట్రం చేశాడు. 2022లో లక్నో సూపర్ జెయింట్స్ బదోనిని 20 లక్షల రూపాయలకు తమ జట్టులో చేర్చుకుంది. అప్పటి నుంచి అతను ఈ జట్టు కోసం ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026లో అతనికి 4 కోట్ల రూపాయల భారీ జీతం లభించనుంది.



# రిజ్వాన్‌కు భారీ అవమానం..

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్‌లో సోమవారం సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఒక చారిత్రాత్మక నిర్ణయానికి వేదికైంది. మెల్బోర్న్ రెనెగేడ్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ మొహమ్మద్ రిజ్వాన్‌ను, అతని నెమ్మదైన బ్యాటింగ్ కారణంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ ఇన్నింగ్స్ మధ్యలోనే వెనక్కి పిలిపించారు. దీంతో బీబీఎల్ చరిత్రలో 'రిటైర్డ్ అవుట్ల అయిన తొలి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు.సిడ్నీ థండర్‌తో జరిగిన ఈ పోరులో మెల్బోర్న్ రెనెగేడ్స్ మొదట బ్యాటింగ్ చేపట్టింది. నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మొహమ్మద్ రిజ్వాన్ క్రీజులో పాతుకుపోయినప్పటికీ, ఆశించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోయాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో రిజ్వాన్ సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. ఆయన 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం తగ్గింది.ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇన్నింగ్స్ ముగియడానికి ఇంకా 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, భారీ హిట్టర్లు అవసరమని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్లగా పరిగణిస్తారు.రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ మాస్టర్ ప్లాన్ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. పాక్ ఆల్ రౌండర్ హసన్ ఖాన్ (31 బంతుల్లో 46) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది.






# సోఫీ షైన్‌తో శిఖర్ ధావన్ నిశ్చితార్థం!

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన స్నేహితురాలు సోఫీ షైన్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. చాలా కాలంగా ఇద్దరూ ఒకరినొకరు డేట్ చేస్తున్నారు. మొదట్లో సీక్రెట్‌గా జరిగిన వ్యవహారాన్ని సోషల్ మీడియా ద్వారా అప్పుడప్పుడు వెల్లడిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఏకంగా వారి నిశ్చితార్థం విషయాన్ని కూడా చెప్పేశారు. తన నిశ్చితార్థం ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అభిమానులకు ఈ శుభవార్తను అందించాడు. సోఫీ కంటే ధావన్ 5 సంవత్సరాలు పెద్దవాడు. శిఖర్ ధావన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫోటోను షేర్ చేశాడు, ఇందులో శిఖర్, సోఫీ చేతిలో నిశ్చితార్థపు ఉంగరం ఉంది. శీర్షికలో, ధావన్ ఇలా రాశాడు, "నవ్వులు పంచుకోవడం నుంచి కలలను పంచుకోవడం వరకు, మా నిశ్చితార్థం కోసం వచ్చిన ప్రేమ, ఆశీర్వాదాలు, ప్రతి శుభాకాంక్షలకు నేను కృతజ్ఞుడను, ఎందుకంటే మేము కలిసి జీవించాలని నిర్ణయించుకున్నాము." అని రాసుకొచ్చాడు. సోఫీ ఐర్లాండ్‌కు చెందిన యువతి. ఆమె ఒక ప్రోడక్ట్ కన్సల్టెంట్. ప్రస్తుతం ఆమె అబుదాబిలోని ఒక కంపెనీలో సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె 1990లో జన్మించింది, ప్రస్తుతం ఆమె వయస్సు 36 సంవత్సరాలు. లిమెరిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మార్కెటింగ్, మేనేజ్‌మెంట్‌లో చదువు పూర్తి చేసింది.2023లో శిఖర్ ధావన్‌కు చాలా ఇబ్బందికరమైన సమస్యలు వచ్చాయి. బ్యాడ్ టైం నడిచింది. మొదటి భార్య ఆయేషా ముఖర్జీ వివాదాలు సాగాయి. కలిసి జీవించలేమని గ్రహించి ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. కుమారుడికి దూరం కావడంతో శిఖర్ ధావన్ చాలా భావోద్వేగానికి లోనయ్యాడు. వాటిని ఏమాత్రం తనలో దాచుకోలేదు. వాటిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ తన ఆలోచనలు పంచు కుంటూ పోస్ట్‌లు పెట్టాడు. కట్ చేస్తే ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో ధావన్ సోఫీ షైన్‌తో కనిపిం చి అందరికీ షాక్ ఇచ్చాడు. ఈ టోర్నమెంట్‌కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చింది. కానీ భారత్ ఆ దేశం వెళ్లలేదు. తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడింది. దుబాయ్‌లోని ఒక రెస్టారెంట్‌లో సోఫీ షైన్‌ను మొదటిసారి కలిసినట్లు ధావన్ చెప్పారు. ఆ రోజున కామోఫ్లాజ్ ట్రౌజర్స్, జాకెట్‌లో సోఫీ చాలా అందంగా కనిపించిందని క్రికెటర్ చెప్పాడు. మొదటి సమావేశం గురించి మాట్లాడుతూ, ధావన్ అందమైన ముఖం, అల్లరి కళ్ళతో ఆకర్షితుడైనట్లు సోఫీ చెప్పారు.నిశ్చితార్థం చేసుకున్న శిఖర్ ధావన్ సోఫీ షైన్ కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు కూడా చేస్తున్నారు. ధావన్ అతనితో చాలా ఫన్నీ వీడియోలను షేర్ చేశాడు. వార్తల ప్రకారం, వచ్చే నెలలో శిఖర్ , సోఫీ వివాహం జరగనుంది.

# కథ చిన్నదే అయినా..కథనం అద్భుతం

## ప్రేక్షకులను సరదా పట్టించిన మనశంకర వరప్రసాద్

సాధారణంగా చిరంజీవి సినిమా అంటే .ఓష్...దానికి తోడు ప్రత్యేక పాత్రలో వెంకటేశ్ తోడయ్యాడు. ఇంకేముందీ.. అంచనాలు అంబరాన్ని తాకాయి. విడుదలైన ప్రచార చిత్రాలన్నీ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకుడు కావడంతో విజయం తథ్యం అని జనాలంతా ఫిక్సయిపోయారు. ఇంతటి పాజిటివ్ వాతావరణం మధ్య ఎట్టకేలకు సోమవారం 'మన శంకర వరప్రసాద్‌గారు' సంక్రాంతికి వచ్చేశారు. కథలోకి వెళితే... కేంద్రమంత్రి శర్మ(శరత్ సక్సేనా)కు 'నిన్ను చంపేస్తున్నాం' అంటూ ఓ హంతకుల గ్యాంగ్ నుంచి బెదిరింపు కాల్ రావడం.. ఆయన దగ్గర పనిచేస్తున్న నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్ శంకర్‌వరప్రసాద్(చిరంజీవి) ఆ గ్యాంగ్‌ని తుదముట్టించడంతో కథ మొదలవుతుంది. శంకర్‌వరప్రసాద్‌ని శర్మ తన కుటుంబ సభ్యుడిగా చూసుకుంటూ ఉంటాడు. ఎప్పుడూ సరదాగా ఉండే శంకరప్రసాద్ మనసులో ఏదో బాధ ఉన్నదని గ్రహించిన శర్మ.. ఓ రోజు శంకరప్రసాద్‌ని కారణం అడగుతాడు. భార్యతో విడిపోవడం.. కన్నబిడ్డలకు దూరం కావడం.. ఇవే శంకర వరప్రసాద్ బాధకు కారణాలని శర్మకు అర్థమవుతుంది. అందుకే ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లల్ని కలుసుకునే ఏర్పాటు చేస్తాడు శర్మ. ఆ స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అయిన శంకర వరప్రసాద్.. తన పిల్లలకు ఎలా చేరువయ్యాడు? అసలు శంకరప్రసాద్ భార్యతో విడిపోవడానికి కారణం ఏంటి? చివరకు ఆ కుటుంబం ఎలా కలిసింది? అనే ప్రశ్నలకు సమాధానమే మిగతా కథకథగా చెప్పుకుంటే పెద్దగా కథేం కాదు. కానీ ఉన్న కథను క్యూట్‌గా.. ఎక్కడా అనవసరపు పాత్రలు కానీ, సన్నివేశాలు



కానీ లేకుండా అర్థవంతంగా నడిపాడు దర్శకుడు అనిల్ రావిపూడి. సాధారణంగా ఇలాంటి కథలకు లాజిక్కులు వెతక్కూడదు. ఈ సినిమాలో కూడా కొన్ని లాజిక్ లేని విషయాలున్నా అవి ఆడియన్స్‌ని అంతగా ఇబ్బంది పెట్టవ్. అపార్థం చేసుకొని విడిపోయిన భార్యకు తానేంటో అర్థం కావాలని తపించే భర్త కథ ఇది. దూరమైన బిడ్డలను అక్కున చేర్చుకోవాలని తహతహలాగే ఓ తండ్రి కథ ఇది. ఈ కథ చుట్టూ వినోదాన్ని మేళవించి జనరంజకంగా మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రధాన పాత్రల మధ్య ఏర్పాడే ఆయా పరిస్థితుల నుంచి పుట్టే కామెడీనే ఈ సినిమాలో ఆద్యంతం కనిపిస్తుంది. సిట్యువేషనల్ కామెడీ కావడంతో సినిమా ఎక్కడా విసుగు రాలేదు. ప్రథమార్థం పాత్రల పరిచయాలు, హీరోహీరోయిన్లు కలవడం, విడిపోవడం, దానికి సంబంధించిన పరిస్థితుల నేపథ్యంలో సాగింది. సమస్యలు సీరియస్‌వే అయినా.. చెప్పడం మాత్రం వినోదంగా చెప్పాడు. ఈ కథలో విలన్ పాత్ర గురించి ప్రత్యేకించి చెప్పాలి. చిరంజీవి సినిమాల్లో విలన్ అంటే అత్యంత శక్తిమంతుడిగా, ప్రమాదకారిగా కనిపిస్తాడు. కానీ ఈ సినిమాలో ప్రధాన విలన్ ఓ కామన్ మ్యాన్ కావడం

విశేషం. అతను విలన్‌గా మారే పరిస్థితులు కూడా లాజికల్‌గానే అనిపిస్తాయి. అసలు విలన్ కామన్ మ్యాన్ అవ్వడం వల్లే ఈ కథలో ఆసక్తి ఇంకాస్త పెరిగిందనాలి.ద్వితీయార్థం కొంతభాగం కాస్త సీరియస్ వేలో సాగినా.. చివరి 20 నిమిషాలు వెంకటేశ్ ఎంట్రీతో సినిమా మళ్లీ వినోదంవైపు టర్న్ తీసుకున్నది. వెంకీగౌడాగా తెరపై వెంకటేశ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఓ విధంగా ఆయన ఉన్నంతవరకూ తెరపై అందర్నీ డామినేట్ చేశారు. తెరపై చిరంజీవి, వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో సందడి చేయడం.. అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా కన్నుల పండుగ అనిపించింది. శంకరవరప్రసాద్‌గా చిరంజీవి అభినయం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పాత్రలు ఆయన కేక్‌వాక్. ఎప్పటిలాగే తనదైన యాక్షన్, కామెడీ, ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని అలరించారు చిరంజీవి. సరదాగా ఉన్నప్పుడు 'చంటాబ్బాయి'ని గుర్తు చేస్తూ.. అవసరమైనప్పుడు రౌడీ అల్లుడ్నీ, ఘరనామొగుడ్నీ యాదికి తెస్తూ.. పాటల్లో 'కొండవీటి దొంగ'ను.. యాక్షన్‌లో 'గ్యాంగ్ లీడర్'ని గుర్తు చేస్తూ వింటేజ్ మెగాస్టార్ తెరపై సాక్షాత్కరించారని చెప్పక తప్పదు. ఇక ఇందులో చిరంజీవికి సమానమైన పాత్ర నయనతారది. ఆ పాత్రలో ఉండే దర్పం, అభిజాత్యాన్ని అద్భుతంగా పలికించింది నయనతార. ఆమె చేయడం వల్ల ఆ పాత్రకు నిండుదనం వచ్చిందని చెప్పొచ్చు. ఇక సచిన్ ఖేడేకర్‌ది ఇందులో కీలకమైన పాత్ర. ఎప్పటిలాగే తనదైన అభినయంతో ఆయన ఆకట్టుకున్నారు. మిగతా నటీనటులంతా తమదైన పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఇక చివరిగా వెంకటేశ్ చివరి 20 నిమిషాలు ఆయన సినిమాలో కనిపిస్తారు. అప్పటివరకూ ఓ స్థాయిలో నడిచిన సినిమాను తన రాకతో పరుగులు పెట్టించాడు వెంకటేశ్. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ నిజంగా సూపర్బ్. చిరంజీవి, వెంకటేశ్ పాత్రల్నీ ఆయన ట్యాకిల్ చేసిన తీరు మాత్రం నిజంగా అభినందనీయం. ఇక ఈ సినిమా ప్రధాన బలాల్లో భీమ్స్ సంగీతం ఒకటి. ప్రతి పాటా జనాలకు నచ్చింది. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకునేలా ఉంది. సమొత్తంగా ఆద్యంతం తనదైన కామెడీతో గిలిగింతలు పెడుతూ.. అక్కడక్కడ ఎమోషన్స్‌తో మనసుల్ని గిల్లుతూ, అవసరమైన చోటా మెగాస్టార్ గ్రేస్‌ని నేటి తరానికి పరిచయం చేస్తూ, అభిమానులకు వింటేజ్ మెగాస్టార్‌ని గుర్తు చేస్తూ.. అద్భుతంగా సినిమాను మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి.




## నిఖిల్ స్వయంభుపై పెరుగుతున్న అంచనాలు

**విడుదలకు సిద్ధంగా ఉన్న పాన్ ఇండియా చిత్రాలో 'స్వయంభు' ఒకటి. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా,సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది.పిరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా, రా గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.**

-------------

## సంక్రాంతికి రొమాంటిక్ టచ్ ఇస్తున్న రవితేజ!




రవితేజ తన సినిమాల విషయంలో ఎంత మాత్రం గ్యాప్ రానీయడు. అనుకోకుండా ఒక్కోసారి లెక్క తప్పడం వలన, ప్రాజెక్టులు ఆలస్యమవుతూ ఉంటాయే తప్ప, తానుగా ఆలస్యం చేయడమనేది తనకి ఎంతమాత్రం అలవాటు లేని పని. నాన్చడం ఆయనకి ఎంత మాత్రం ఇష్టం ఉండదు. అందువల్లనే ఆయన నుంచి చకచకా సినిమాలు వచ్చేస్తూ ఉంటాయి. అలా ఈ సంక్రాంతికి వస్తున్న సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 13వ తేదీన విడుదల కానుంది. రవితేజ కథనాయకుడిగా నటించిన ఈ సినిమాలో, కథనాయికలుగా ఆషికా రంగనాథ్ – డింపుల్ హయతి అలరించనున్నారు. ఈ ఇద్దరితో కలిసి రవితేజ చేసే రొమాన్స్, ఫ్యామిలీ ఆడియన్స్ కి నచ్చేలా కామెడీ టచ్ తో నడుస్తుందని అంటున్నారు. డింపుల్ కి ఉన్న హాట్ ఇమేజ్ .. ఆషికకి గల ఫాలోయింగ్ ఈ సినిమాకి ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ ల ద్వారా మంచి మార్కులు కొట్టేసిన కిశోర్ తిరుమల ఈ సినిమాకి దర్శకత్వం వహించడం విశేషం. 'నా సామిరంగ' సినిమాలో నాగార్జున సరసన గ్లామర్ పరంగా సందడి చేసిన ఆషికా రంగనాథ్ ఆ తరువాత చేసిన సినిమా ఇది. భార్యకీ .. ప్రియురాలికి మధ్యలో నలిగిపోయే పాత్రలో రవితేజ నటన, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని అంటున్నారు. సంక్రాంతి సినిమా నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల అంశాలు ఈ సినిమాలో ఉంటాయని చెబుతున్నారు. చూడాలి మరి ఈ సంక్రాంతి బరిలో ఈ సినిమా ఏ స్థాయిలో సందడి చేస్తుందో.




## ఆ పాత్రకు ఒక మొండితనం ఉంది...

### : శోభిత ధూళిపాళ్ల

ప్రముఖ నటి శోభితా ధూళిపాళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా క్రైమ్ సస్పెన్స్ డ్రామా 'చీకటిలో'. ఈ చిత్రంలో ఆమె సంధ్య అనే పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా త్వరలో అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానున్న నేపథ్యంలో, శోభిత తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సంధ్య పాత్రలో నటించడం ఒక అద్భుతమైన అనుభవం అని ఆమె పేర్కొన్నారు.తన పాత్ర గురించి వివరిస్తూ, "ఆమె ఒక ముక్కుసూటి అమ్మాయి. స్వతంత్రంగా ఆలోచిస్తుంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తన నమ్మకాలకు కట్టుబడి ఉంటుంది. ఆమె నిర్ణయాల వెనుక ఒక ప్రత్యేకమైన మొండితనం, దానికి ఒక చరిత్ర కూడా ఉంది" అని శోభిత తెలిపారు. హైదరాబాద్ వీధులు, ఇతర తెలుగు ప్రాంతాల సాంస్కృతిక నేపథ్యం ఉన్న పాత్ర కావడం వల్ల, అందులో సులభంగా ఒదిగిపోగలిగానని ఆమె చెప్పారు."ప్రైమ్ ఒరిజినల్ ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఎంతో ప్రత్యేకమైనది. 'మేడ్ ఇన్ హెవెన్ల నుంచి 'చీకటిలో' వరకు నా ప్రయాణం స్ఫూర్తిదాయకంగా సాగింది. జనవరి 23న ప్రైమ్ వీడియోలో సినిమా విడుదలయ్యాక, సంధ్యగా నాలోని మరో కోణాన్ని ప్రేక్షకులు చూస్తారు" అని శోభిత ఆశాభావం వ్యక్తం చేశారు.హైదరాబాద్ నేపథ్యంలో సాగే ఈ కథలో, నిజాలను వెలికితీసే క్రమంలో సంధ్య అనే ట్రూ క్రైమ్ పాడ్‌కాస్టర్ నగరంలోని కొన్ని చీకటి రహస్యాలను ఎలా ఎదుర్కొందనేది చూపిస్తారు. ఈ చిత్రంలో విశ్వదేవ్ రాచకొండ హీరోగా నటించగా, చైతన్య విశాలాక్షి, ఈషా చావ్లా, ఝాన్సీ, ఆమని, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలు పోషించారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ థ్రిల్లర్‌ను సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డి. సురేష్ బాబు నిర్మించారు. ఈ చిత్రం జనవరి 23 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

## సుప్రీంను ఆశ్రయించిన జననాయగన్

'జన నాయగన్'కు మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'జన నాయగన్' టీమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ నేడు పిటిషన్ వేసింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడీ స్టే పై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



## రాజాసాబ్ మూడ్రోజుల వసూళ్ళు 183 కోట్ల గ్రాస్

మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజాసాబ్' సినిమా సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందింది. మైండ్ గేమ్ ఛాలెంజింగ్‌గా వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. నైజాం ప్రీమియర్స్ పరంగా కాస్త దెబ్బ పడిన ఓవరాల్ మాత్రం సాలిడ్ స్టార్టప్ అందుకుంది రాజాసాబ్. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 112 కోట్లు గ్రాస్ వసూలు చేసింది. దీంతో.. ప్రభాస్ కెరీర్లో వంద కోట్ల ఓపెనింగ్స్ రాబట్టిన 6వ సినిమాగా రాజాసాబ్ రికార్డ్ నమోదు చేసింది. మిక్స్డ్ టాక్ వచ్చిన సరే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్నాడు రాజాసాబ్. ఇక ఈ సినిమా ఫస్ట్ వీక్ రన్ ఫినిష్ చేసుకుంది. రిలీజ్ అయిన మూడు రోజులకు గాను రూ. 183 కోట్ల గ్రాస్ రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక నేటి నుండి వరుస సెలవలు కావడంతో బుకింగ్స్ లో జోరు చూపిస్తూ ఈ రోజు ముగిసేనాటికి రూ. 200 కోట్ల మార్క్ అందుకుంటుందనీ ట్రేడ్ అంచనా వేస్తుంది.

